

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	36.8	28.8
కావలి	36	28
ఆత్మకూరు	37	27
ఉదయగిరి	37	27
కందుకూరు	36	28



కొండ కింద ఘాట్‌లో ముఖద్వారానికి వేసిన రంగులు

మాలకొండలో నేడు నృసింహ జయంతి!

- వేలాదిగా తరలిరానున్న భక్తజనం
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనృసింహ జయంత్యుత్సవాలకు మాలకొండ క్షేత్రం ముస్తాబయ్యింది. శనివారం నాటి ఉత్సవానికి ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్ది, ప్రాంగణంలోని దేవతామూర్తుల విగ్రహాలకు రకరకాల రంగులు అద్దారు. సుమారు 40 వేల మందికిపైగా భక్తులు వస్తారనే అంచనాతో అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేసవిని దృష్టిలో పెట్టుకొని దాతల సాయంతో మజ్జిగ, మినరల్‌వాటర్, శీతల పానీయాలు అందజేయనున్నట్లు డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు చెబుతున్నారు. అంతేగాక భక్తులకు ఎక్కడికక్కడే నీడ కోసం షామియానాలు, తాటాకు చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు పార్కింగ్ వసతి కల్పిస్తున్నారు. భక్తుల అంచనా ప్రకారం లడ్డూప్రసాదం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలినడకన కొండపైకి వెళ్లే మెట్లమార్గంలో అక్కడక్కడ మంచినీరు, మజ్జిగ తదితర వసతులు కల్పిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా 150 మందితో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

స్వామివారి జయంత్యుత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాము. ఎక్కడికక్కడ మజ్జిగ, మినరల్ వాటర్, శీతల పానీయాలు, అన్నదానం ఏర్పాటు చేశాం, ఆలయ ప్రాంగణమంతా షామియానాలు, తాటాకు చలువ పందిళ్లు వేయిస్తున్నాము. వాహన పార్కింగ్, పోలీస్ భద్రతా చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేశాం

- సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్, మాలకొండ

నేటినుంచి కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

జొన్నవాడలో విస్తృత ఏర్పాట్లు



ఆలయ రాజగోపురానికి విద్యుద్దీపాలంకరణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని కామాక్షితాయి, మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 27వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. శనివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యే ఉత్సవాలు ఆదివారం ధ్వజారోహణం, 19న శేషవాహనం, 20న పురుషామృగవాహన సేవ, 21న సింహ వాహనం, 22న హంసవాహనం, 23న రావణసేవ, 24న వెండి నందిపై ఆదిదంపతులు విహరించనున్నారు. 25న రథోత్సవం, 26న ఉదయం కల్యాణం, రాత్రి తెప్పోత్సవం, 27వ తేదీన ధ్వజావరోహణం, అలకలతోపు, అశ్వవాహనసేవ, రాత్రి ఏకాంతసేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాము చేస్తున్నారు. జొన్నవాడ నుంచి బుచ్చిలోని జొన్నవాడ సెంటర్ వరకు, కాగులపాడు సెంటర్, జొన్నవాడలోని పెన్నానది నుంచి అవతల ఒడ్డున జొన్నవాడ రేవు వరకు భక్తులను స్వాగతించేలా విద్యుద్దీపాలంకరణ చేస్తున్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఏవీ. శ్రీనివాసులురెడ్డి, సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ నిత్యాన్నదాన సదనంలో ప్రత్యేక భోజన సదుపాయం, ఉచిత ప్రసాదాల వితరణ, మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



కోవూరు పంచాయతీలో రూ.2 కోట్లకుపైగా మింగేశారు. పడుగుపాడులో రూ.ఒకటిన్నర కోటి వరకూ పక్కదారి పట్టించారు. ముత్తుకూరులో రూ.2 కోట్లు, కృష్ణపట్నం పంచాయతీలో మరో రూ.1.5 కోట్లు వరకూ దుర్వినియోగం చేశారు. పొదలకూరులో ఏకంగా లేఅవుట్లకు నిబంధనలకు విరుద్ధంగా ఎన్‌వోసీలు మంజూరు చేశారు. ఉదయగిరిలో అయితే ఓ కార్యదర్శి వేరే పంచాయతీలో జరిగిన సీసీ రోడ్డు వర్కుకు ఇక్కడ బిల్లులు పెట్టుకొని తినేశారు. ఇవి కొన్ని మాత్రమే. వెలుగులోకి రానివి ఇంకా ఎన్నో ఉన్నాయి.

తిలాపాపం.. తలాపిడికెడు!

- పంచాయతీల్లో భారీగా నిధులు పక్కదారి
- రూ.కోట్లు తినేస్తున్న కార్యదర్శులు
- వీరికి ఉన్నతాధికారుల సహకారం?
- మామూళ్ల మత్తులో పట్టించుకోని ఆడిట్ శాఖ
- మళ్లీ వీరి చేతికే విచారణ బాధ్యతలు

నెల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా ప్రజాధనాన్ని అక్రమార్కులంతా కలిసి పంచుకుంటున్నారు. గ్రామాభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను అప్పనంగా జేబుల్లో నింపుకున్నారు. పంచాయతీ కార్యదర్శులే కాకుండా వారి పైఅధికారులు, ఆడిట్ శాఖ అధికారులు కూడా ఈ అక్రమాల్లో భాగస్వాములుగా ఉంటున్నారు. 2021-24 మధ్య అప్పటి వైసీపీ నాయకుల అండతో కొందరు కార్యదర్శులు పంచాయతీల నగదును తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. చిన్న, మేజర్ పంచాయతీలు అన్న తేడాలేకుండా రూ.లక్షల్లో నిధులు పక్కదారి పట్టినట్లు తేలుతోంది. గడిచిన పది నెలల కాలంలో పదుల సంఖ్యలో కార్యదర్శులు సస్పెండ్ అవ్వగా, పలువురు సర్పంచ్‌ల చెక్‌పవర్‌లు రద్దయ్యాయి. అయితే నిధులు దుర్వినియోగం జరగకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కవడంతో అవినీతి స్థాయి పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

అధికారులు ఏం చేస్తున్నట్టు?

ఎవరో ఒక అనామక వ్యక్తి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే తప్ప పంచాయతీల్లో అవినీతి జరిగినట్లు ఆ శాఖ అధికారులు గుర్తించలేకపోతుండటం గమనార్హం. అవినీతి బయటపడగానే పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప అందుకు బాధ్యులైన పర్యవేక్షక అధికారులపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. మండలంలోని ఈవోపీఆర్‌డీ ప్రతి పంచాయతీ రికార్డును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. అలానే డీఎల్‌పీవో, డీపీవో కూడా ర్యాండమ్‌గా 30 శాతం పంచాయతీల్లో తనిఖీలు చేయాలి. ఇటీవల బయటపడిన కోవూరు, ఉదయగిరి, పొదలకూరు, పడుగుపాడు, ముత్తుకూరు, కృష్ణపట్నం వంటి పంచాయతీల్లో ఈవోపీఆర్‌డీ, డీఎల్‌పీవో, డీపీవో స్థాయి అధికారులు ఇన్‌స్పెక్షన్ చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ వారి తనిఖీల్లో అక్రమాలు ఎందుకు బయటపడలేదన్నదే ఇప్పుడు ప్రశ్న.

'ఆడిట్'లో ఇంటిదొంగలు

పంచాయతీల్లోని ప్రతి రూపాయిని ఆడిట్ శాఖ అధికారులు ఏటా ఆడిట్ చేస్తుంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే వెంటనే ఆడిట్ అధికారుల విచారణలో తేలిపోతుంది. అప్పుడు మరుసటి సంవత్సరం ఆ తప్పు జరగకుండా నిలువరించేందుకు అవకాశం ఏర్పడుతుంది. కానీ జిల్లాలో ఆడిట్ శాఖ పనితీరు గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇప్పుడు రూ.కోట్ల అవినీతి బయటపడుతున్న ప్రతి పంచాయతీలోనూ ఆడిట్ శాఖ అధికారులు ఆడిట్‌ను పూర్తి చేసి ఉన్నారు. మరి వారు ఎందుకు గుర్తించలేకపోయారంటే సమాధానం లేదు. ఆడిట్ చేసే వారు పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆడిట్ శాఖలో చాలా మంది ఏళ్ల తరబడి పాతుకుపోయి ఉన్నారు. ఆఖరుకు జిల్లా ఆడిట్ అధికారిది కూడా సొంత జిల్లానే కావడం విశేషం. తాజాగా కోవూరు పంచాయతీ అవినీతి వ్యవహారంలో ఆడిట్ అధికారులపై కూడా క్రిమినల్ చర్యలకు పంచాయతీరాజ్ డైరెక్టర్ ఆదేశించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలంటూ ఆడిట్, పంచాయతీ శాఖలను ఆర్నెల్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే నేటికీ విచారణ పూర్తికాకపోవడం కొసమెరుపు.

మరో 9మందిపై విచారణ

రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

నెల్లూరు (జడ్పీ) : పంచాయతీల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో మరో 9మంది కార్యదర్శులపై పంచాయతీ శాఖ అధికారులు విచారించి, నివేదికలను రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపి ఉన్నారు. మనుబోలు మండలం జట్లకొండూరు, ఏఎస్‌పేట-ముదివర్తిలో ముగ్గురు కార్యదర్శులు, బుచ్చి మండలం ఇసుకపల్లి, చిల్లకూరు మండలం వరగలి, కోవూరు మండలం పడుగుపాడు కార్యదర్శలతోపాటు పొదలకూరు మండలంలో కార్యదర్శిగా పని చేసి ప్రస్తుతం డక్కిలి మండలం ఈవోఆర్డీగా ఉన్న అల్లాభక్షుపైన నివేదికలు పంపి ఉన్నారు. దీంతో వీరిపైనా వేటు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే మరికొన్ని పంచాయతీలపైన పంచాయతీ శాఖకు ఫిర్యాదులు అందుతుండటంతో గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడిన కార్యదర్శులకు గుండెల్లో దడ పుట్టుకువస్తోంది. గతంలో పొరపాట్లు జరిగాయని, తమను రక్షించాలంటూ ప్రస్తుత పాలకుల వద్ద కార్యదర్శులు మొర పెట్టుకుంటూ, స్థానిక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పైరవీలు సాగిస్తున్నా కూటమి ప్రభుత్వంలో కురదడం లేదు. దీంతో గతంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రతి కార్యదర్శి శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టెన్షన్ పడకండలా..!?

- ఎక్కువైతే రక్తపోటు బారిన పడ్డట్టే!
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే
- బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం
- జిల్లాలో 4 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్తులు
- నేడు ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం



ఓ వైపు పని ఒత్తిడి.. మరోవైపు ఇంట్లో సాధక బాధకాలు.. చదువుకునే విద్యార్థి నుంచి వృద్ధులదాకా ఏదో ఒక అంశంలో ఒత్తిడికి గురవుతూనే ఉన్నారు. నరాల్లో పోటెత్తే నెత్తుటి వేగం అదుపు తప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరి భాషలో చెప్పాలంటే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) అంటారు. సాధారణ భాషలో బీపీ అని అంటారు. జనంలో దడపుట్టిస్తున్న ఈ బీపీపై అప్రమత్తంగా ఉండాలి. ఆదిలోనే అదుపు చేయకపోతే ఇది ప్రాణాంతకంగా మారుతుంది. దీని బారిన పడకుండా ఉండాలంటే ఒక్కటే మార్గం ఒత్తిడికి దూరంగా ఉండటమే. శుక్రవారం ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

8లో..



వెంగళరావునగర్‌లో రోడ్డెక్కి పారుతున్న మురుగు

కొద్దిపాటి వర్షం.. ఉప్పొంగిన వ్యర్థం

- కావలిలో డ్రైనేజీ వ్యవస్థ తీరిది!



బాలాజీ నగర్‌లో రోడ్డుపై వర్షపునీరు

కావలిలో డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉన్నదో ఈ చిత్రాలే నిదర్శనం. కొద్దిపాటి వర్షం కురిసినా కాలువలు ఉప్పొంగి మురుగు రోడ్లపై పారుతోంది. ఇక వర్షపు నీటితో రోడ్లు మడుగులను తలపిస్తు న్నాయి. శుక్రవారం ఉదయం కావలిలో కురిసిన మోస్తరు వర్షానికే పట్టణంలో చాలాచోట్ల కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో కాలువల్లోని చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలతో కూడిన మురుగు రోడ్లపైకి చేరడంతో దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్లకు ఇరువైపులా కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పాడై ఉండ టంతో మురుగునీటి పారుదల సక్రమంగా లేదు. శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి వెంగళరావునగర్‌లో మురుగు నీరంతా రోడ్లపైకి చేరింది. దీంతో స్థానికులు మున్సి పల్ అధికారులకు ఫిర్యాదు చేయటంతో కాలువలకు అడ్డంగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే సబ్‌కోర్టు వీధిలో టెంకాయల అంగడి వద్ద మురుగు, వర్షపు నీరు రెండూ కలిసి పోయి ప్రవహించాయి. ముసునూరు తదితర ప్రాంతాలలోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణం లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర చాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జరిగిపోయిన పెళ్లికి శుభలేఖ

- మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సందడి
- కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు

ఉదయగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డు కోసం ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావు. కార్డు కావాలనుకునే వారు ఆధార్‌తోపాటు వారి వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం జత చేసి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అయితే పెళ్లి కార్డు ఉంటేనే వివాహ ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారు. ఈ పత్రం ఇవ్వాలంటే శుభలేఖ దరఖాస్తు ఫారానికి జత చేయాల్సి ఉంది. దీంతో పెళ్లిళ్ల అయిన వారు ప్రింటింగ్ ప్రెస్‌లలో మరోమారు శుభలేఖలు ముద్రణ చేయించుకొంటున్నారు.

ధ్రువపత్రాలు సరిగ్గా ఉంటే..

వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తుకు దంపతుల ఆధార్ కార్డులు, వయసును నిర్ధారించే పదో తరగతి టీసీ లేదా డాక్టర్ జారీ చేసిన ధ్రువపత్రం, శుభలేఖ, పెళ్లినాటి ఫోటోలు, ముగ్గురు సాక్షులు, కల్యాణ మండపం రశీదు, ఆలయంలో వివాహం జరిగి ఉంటే పురోతుడి ధ్రువీకరణపత్రం, రూ.500 చలానా జత చేసి సబ్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు ఇవ్వాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఓ గంటలోనే వివాహ ధ్రువీకరణపత్రం మంజూరు చేస్తారు.

అలస్యం చేస్తే వ్యయ ప్రయాసలే!

వివాహం జరిగిన 60 రోజుల్లో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడే వివాహ ధ్రువీకరణపత్రం మంజూరు చేస్తారు. గడువు దాటిన వారు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం వివాహ ధ్రువీకరణపత్రం కోసం అనినరకాల సర్టిఫికెట్లు కావాల్సి ఉండటంతో రూ.వేలల్లో ఖర్చవుతోంది. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు ఐదారు మంది దంపతులు వివాహ ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని కార్యాలయ అధికారులు తెలుపుతున్నారు.



ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ ధ్రువీకరణపత్రం కోసం వచ్చిన దంపతులు



నిందితుడి (ముసుగులో ఉన్న వ్యక్తి) వివరాలు తెలుపుతున్న ఎస్పీ కృష్ణకాంత్

స్నేహితుడే హంతకుడు!

- ఆర్థిక లావాదేవీలతోనే రియల్టర్ హత్య
- పోలీసులకు 'దృశ్యం' సినిమా చూపించిన నిందితుడు
- చివరికి చాకచక్యంగా వివరాలు వెలుగులోకి..

6

నటుడు వెంకటేష్ నటించిన 'దృశ్యం' సినిమా గుర్తుందా!? ఓ హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు ఇంటిల్లిపాదితో కలిసి పోలీసులను తప్పుదోవ పట్టిస్తాడు. పోలీసులు కూడా ఎన్ని ప్రయత్నాలు చేసినా కథానాయకుడిపై కేసును రుజువు చేయలేదు. మరి నిజజీవితంలోనూ ఓ ప్రభుత్వ ఉద్యోగి 'దృశ్యం' మరిపించేలా నాటకాన్ని రక్తికట్టించాడు. అయితే, ఎన్ని వేషాలు వేసినా పోలీసులకు మాత్రం అడ్డంగా దొరికిపోయాడు. ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో స్నేహితుడినే కడతేర్చాడు. ఈ నెల 5వ తేదీన నెల్లూరులోని వెంకటరెడ్డినగర్‌లో జరిగిన రియల్టర్ హత్య కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..

ఈసీ సభ్యులకు శిక్షణ

వెంకటాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఈసీ సభ్యులు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సూర్య ఘర్‌కి సంబంధించి సోలార్ ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి, ఎంపీడీవో కల్పన, ఐబీ డీపీఎం కామాక్షి, ఏరియా కో ఆర్డినేటర్ మధుసూదన్, వెలుగు ఏపీఎం రుక్మిణీ, తదితరులున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8998
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ. 101.00

స్కిల్ కళాశాలలో వసతుల పరిశీలన

వెంకటాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంటేపల్లి సమీపంలో ఉన్న టూరిజం కళాశాలలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీడాప్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలను శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం శిక్షణలో ఉన్న యువతను సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్కిల్ కళాశాలలో శిక్షణలో ఉన్న యువతకు ఆమె ఉచితంగా యూనిఫాం, శిక్షణ మెటీరియల్‌ను అందించారు.

ప్రతి విద్యార్థి యోగా అలవాటు చేసుకోవాలి

● కల్నల్ కరంచంద్

వెంకటాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి యోగ, ధ్యానం అలవాటు చేసుకోవాలని ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ డి.కరంచంద్ సూచించారు. మండలంలోని చవటపాలెం పంచాయతీ సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నెల్లూరు రెడ్‌క్రాస్ వారు మానవదేహం, గుండె సమస్యలు, రక్తదానం ఆవశ్యకత, రక్త వర్గీకరణ అనే అంశాలపై ప్రయోగం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, క్యాంపు అధికారి బాలబ్రహ్మాచారి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు చంద్రశేఖర్‌రావు, భాస్కర్‌రావు, నాగరాజు, పెంచలయ్య, తదితరులున్నారు.

డెంగ్యూ నివారణపై పొదలకూరులో ర్యాలీ

పొదలకూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా పొదలకూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం వారు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ రిషిత, డాక్టర్ కావ్య తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లులో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జొన్నవాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ జ్వరంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ దుష్పరిణామాలు, లక్షణాలు గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటు నుంచి రక్షణ చర్యలు చేపట్టడం, పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవంతి పాల్గొన్నారు.

కాలువకు కంచె ఏర్పాటుపై మహిళల హర్షం

బుచ్చిరెడ్డిపాళెం, మే 16(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 7వ వార్డులోని ఖాజానగర్‌లో గుడపల్లి కాలువకు కంచె ఏర్పాటు చేసి చిన్నపిల్లలకు ప్రమాదాలు లేకుండా చేయడంపై ఆ ప్రాంత మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ఈ విషయం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఇచ్చిన హామీ మేరకు కంచె ఏర్పాటు చేయించారు. దీనిని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ శుక్రవారం పరిశీలించారు. ఆమె ద్వారా ఆప్రాంతంలోని మహిళలు ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వీధి లైట్ల సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ నస్రీన్ ఖాన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, ఎంవీ. శేషయ్య, మాజీ ఎంపీటీసీ పర్వీన్ పాల్గొన్నారు.

బుచ్చిలో హత్యపై రూరల్ డీఎస్పీ విచారణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 16(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని గోపాల్‌రెడ్డి నగర్‌కు చెందిన సోము మల్లికార్జునరెడ్డి హత్య జరిగిన ఇస్కపాళెం పరిధిలోని గోపాలపురం పొలాలు, పరిసర ప్రాంతాలను శుక్రవారం రూరల్ డీఎస్పి ఘట్టమనేని శ్రీనివాసులు పరిశీలించారు. మల్లికార్జునరెడ్డి హత్యకు ముందు మృతుడి పొలాల్లో వ్యవసాయ పనులు చేసిన నరసయ్యను, మరో వ్యక్తిని విచారించి వివరాలు సేకరించారు. ఆయన వెంట బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి, కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఉన్నారు.

మన మిత్ర స్టాండ్స్ పంపిణీ

సైదాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్ర వారం గ్రామ సచివాలయాలకు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మనమిత్ర స్టాండ్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

తోటపల్లిగూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీ కట్టమీద ముస్లిం కాలనీకి చెందిన షేక్ అనీఫా గేదె విద్యుత్ తీగలు తగిలి శుక్రవారం మృతి చెందింది. బాధితుడు అనీఫా వివరాల మేరకు.. రోజులాగే పశువులను మేత కోసం పొలంలోకి తీసుకెళ్లగా విద్యుత్ తీగలు తగిలి ఒక గేదె అక్కడికక్కడే మృతిచెందిందని తెలిపాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గేదె మృతిచెందిందని ప్రభుత్వం ఆదుకుని పరిహారం ఇప్పించాలని కోరారు.

వివాదాలకు తావులేకుండా
భూముల రీసర్వే చేయాలి

● జిల్లా కలెక్టర్ ఆనంద్

సైదాపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి వివాదాలకు తావులేకుండా భూముల రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను కలెక్టర్ పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు, వాటి సమస్యల పరిష్కారంపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఫారంపాండ్స్, ఇంకుడు గుంతల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌ను ఆదేశించారు. గతంలో పూర్తయిన ఇంకుడు గుంతలు పంచాయతీ నిధులతో శుభ్రం చేసే చర్యలు చేపట్టాలన్నారు.



రైతుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయాన్ని సందర్శించిన సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి మౌనానంద తపోవనం

కామాక్షితాయిని దర్శించుకున్న పీఠాధిపతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని విశాఖపట్నం సీతమ్మధార నార్త్ ఎక్‌టెంక్షన్‌లోని శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి మౌనానంద తపోవనం శుక్రవారం సందర్శించారు. మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ముందుగా ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆయన వెంట సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సభ్యులు సుధాకర్, స్థానిక సర్పంచు కె.పెంచలయ్య, ఆలయ అర్చకులు ఉన్నారు.

సంచార గిరిజన కుటుంబాన్ని సందర్శించిన అదనపు డీఎంహెచ్‌వో

ఇందుకూరుపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేట సచివాలయం-2 పరిధిలోని రాపూరు డొంక ఎస్టీ కాలనీ స్కూల్ పరిసరాల్లో ఉన్న సంచార గిరిజన కుటుంబాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి ఖాదర్‌వలి శుక్రవారం సందర్శించారు. ఆ కుటుంబంలో ఐదేళ్ల చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో కుష్టు సంబంధిత వ్యాధి అనుమానంతో వారం రోజులుగా జిల్లా నుంచి పలు టీంలు వచ్చి వారితో మాట్లాడి న్యూట్రిషన్ డైట్ ఇస్తూ తాత్కాలికంగా చికిత్స ప్రారంభించామన్నారు. అయితే ఆ కుటుంబం ఒకే దగ్గర స్థిరంగా లేకపోవడం వలన ఆ చిన్నారికి వ్యాధి నిర్ధారణ చేయించి చికిత్స చేసేందుకు అవకాశం లేనందున తానే స్వయంగా పరిశీలనకు వచ్చానని తెలిపారు.



గిరిజన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఈ విధంగా వ్యాధి సోకిన పిల్లలకు సకాలంలో వైద్యం అందిస్తే పూర్తిగా నయం చేసి అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, విజయ్‌కుమార్, జిల్లా టీబీ కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

19నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19వ తేదీ ఉదయం ఉత్సవ ఆరంభం, సాయంత్రం అంకురార్పణ, 20న ఉదయం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం శేషవాహన సేవ, సామూహిక లక్ష్మీనారాయణ పూజ, 21న ఉదయం సుదర్శన నారసింహ మేష్టి హోమం, సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం హనుమంత వాహనసేన, 22న ఉదయం గజవాహనం, హంస వాహనం, సాయంత్రం గజవాహన సేవ, 23న ఉదయం కల్పవృక్ష వాహనసేవ, సాయంత్రం అశ్వ వాహన సేవ, 24న ఉదయం రథోత్సవం, చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగం, 25న ఉదయం 101 కలశాలతో అభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ పెంచ్యాల రమణయ్యానాయుడు తదితరులు ఆవిష్కరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పెంచ్యాల రమణయ్యానాయుడు

టీడీపీ మండల అధ్యక్షుడికి సన్మానం

విడవలూరు, మే 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడుగా ఎన్నికైన ఏటూరు హరిరెడ్డిని తెలుగుయువత సీనియర్ నాయకుడు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గ్రామ సర్పంచుగా, ఎంపీటీసీగా, హరిరెడ్డి నిత్యం టీడీపీ బలోపేతానికి కృషి చేశారని తెలిపారు.

ఇదేనా నీటి యాజమాన్యం!?

● అల్లీపురం వద్ద కాలువ తెగడంతో నీరు వృథా

నెల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) : రెండో పంటకు నీటిని పొదుపుగా వాడాలని, సక్రమమైన నీటి యాజమాన్యంతోనే భవిష్యత్ అవసరాలను తీర్చుకోగలుగుతామని సాగునీటి సలహా మండలి సమావేశంలో మంత్రులు, కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అయితే కొందరు క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం మూలంగా నీరు వృథా అవుతోంది. తమ పరిధిలో ఎంత నీరు అవసరమో అంత వరకే తీసుకోవాల్సి ఉండగా, కొందరు ఏఈల తీరు ఇందుకు భిన్నంగా ఉంటోంది. శుక్రవారం అల్లీపురం వద్ద కోడూరు కాలువకు గండి పడడమే ఇందుకు ఉదాహరణ. జాఫర్‌సాహేబ్ కాలువ నుంచి కోడూరు కాలువ వెళుతుంది. ఆ కాలువ సామర్థ్యాన్ని బట్టి, ఆ కాలువ కింద వేసిన ఆయకట్టు మేరకు నీరు విడుదల చేయాలి. అలాకాకుండా విచ్చలవిడిగా కోడూరు కాలువకు నీటిని విడుదల చేయడంతో టిడ్కో ఇళ్ల సమీపంలో కాలువ తెగిపోయింది. నీరంతా ఇళ్లవైపు మళ్లాయి. చాలా నీరు వృథా జరిగింది. ఈ కాలువకు గండిపడడాన్ని అటుగా వెళుతున్న 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి గుర్తించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు సాయంత్రానికి కోడూరు కాలువకు గండిపూడ్చారు.



అల్లీపురం వద్ద కోడూరు కాలువకు గండిపడటంతో టిడ్కో ఇళ్ల వైపు వెళుతున్న నీరు

గ్రామ కాపుల ఎన్నిక



కాపులుగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరిణి పంచాయతీ వీరారెడ్డి పాళెంలో శుక్రవారం గ్రామ కాపులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో పెద్దకాపుగా బక్తాని బ్రహ్మయ్య, రెండో కాపుగా కోడి వెంకటేశ్వర్లు, మూడో కాపుగా పాపింగాని రామస్వామిలను మత్స్యకారులంగా సమష్టిగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా ఉండడానికే మత్స్యకారులు వీరిని నియమించుకున్నారని టీడీపీ నాయకుడు తుళ్లూరు మాధవ్ తెలిపారు. కాపులు మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలు వచ్చినా, సామరస్యంగా పరిష్కరించుకోవడానికే ఈ నిబంధన పెట్టడం జరిగిందన్నారు. అనంతరం ఎన్నికైన కాపులను టీడీపీ నాయకులు తుళ్లూరు మాధవ్, తిమ్మరాజు తిరుపతి, కొండా రఘులు ఘనంగా సన్మానించారు.

పార్టీలకతీతంగా పొట్టి శ్రీరాములు జయంతి

బుచ్చిరెడ్డిపాళెం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీన నెల్లూరులోని శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు పార్టీలకతీతంగా జరుగుతాయని పొట్టిశ్రీరాములు ట్రస్టు సభ్యులు తెలిపారు. శుక్రవారం బుచ్చిలోని ఓ కల్యాణ మండపం ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశం ట్రస్టు సభ్యుడు ఎంవీ.శేషయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించే ఈ వేడుకలు నెల్లూరులోని స్టోన్ హౌస్‌పేటలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీలో నిర్వహిస్తామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తిరివీధి రాధకృష్ణయ్య, హరనాథ్, కౌన్సిలర్ సత్యం, నాయకులు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం, కాసా శ్రీనివాసులు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

కోవూరు, మే 16(ఆంధ్రజ్యోతి): కోవూరు న్యాయవాదుల సంఘానికి శుక్రవారం అధ్యక్ష, కార్యదర్శులుగా పీ.సునీల్‌కుమార్, సీహెచ్ చంద్ర మోహన్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీహెచ్ తిరుమలేష్ ప్రకటించారు. అధ్యక్ష పదవికి పీ.సునీల్ కుమార్ ఒక్కరే పోటీ చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి సీహెచ్.చంద్రమోహన్, పీ.బాబు పోటీ పడ్డారు. ఈ ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరిగింది.



సునీల్‌కుమార్



చంద్రమోహన్

నగరంలో అర్ధరాత్రి ఎస్పీ తనిఖీలు

నెల్లూరు(క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అర్ధరాత్రి బీట్స్‌ను ఎస్పీ జి కృష్ణకాంత్ తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్టాండు, కూరగాయల మార్కెట్, మద్రాసు బస్టాండు, వీఆర్‌సీ, గాంధీబొమ్మ సెంటర్, ట్రంకు రోడ్డు, నర్తకి సెంటర్, ఆత్మకూరు బస్టాండు, మెయిన్ రైల్వే స్టేషన్, మినీ బైపాస్, శెట్టిగుంటరోడ్డు, వేదాయపాలెం, తదితర ప్రాంతాలలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ క్రమంలో పలు షాపులను మూయించడంతోపాటు అర్ధరాత్రి తిరుగుతున్న ఆకతాయిలను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాత్రి గస్తీ నిర్వహించే పోలీస్ సిబ్బంది, అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కోవూరులో భారీ అగ్ని ప్రమాదం

కోవూరు, మే16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీఆర్‌ఆర్ కాలనీ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ పాత ఇనుప వస్తువుల దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎగసిపడుతున్న మంటలను ఆర్పేందుకు ఎవరికీ వీలుకాలేదు. అగ్నిప్రమాదం వల్ల పీఆర్‌ఆర్‌కాలనీ నుంచి కోవూరు మొత్తం పొగ అలుముకుంది. ఇదే సమయంలో విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. స్థానికులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



ఎగసిపడుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ. 50 వేల నగదు, 8 గ్రాముల బంగారం అపహరణ

పొదలకూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాపూరు రోడ్‌లో ఉన్న షేక్.మస్తాన్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి రూ.50వేల నగదు, 8గ్రాముల బంగారం వస్తువులను అపహరించుకువెళ్లారు. పొదలకూరు ఇన్‌చార్జ్ ఎస్ఐగా వ్యవహరిస్తున్న మనుబోలు ఎస్ఐ రాకేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

తాళం వేసిన ఇళ్లలోనే చోరీలు

పొదలకూరులో గత ఒకటిన్నర నెలల వ్యవధిలో తాళం వేసిన ఇళ్లలోనే దొంగలు చోరీకి పాల్పడడం గమనార్హం. గత నెల 9వ తేదీన ఒకేరోజు రెండు ఇళ్లల్లో చోరీ జరిగిన సంగతి తెలిసిందే. పొదలకూరు పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఓ ఇంటి కుటుంబ సభ్యులు తిరుణాలకు వెళ్లి వచ్చే సమయానికి దొంగలు తాళం పగులగొట్టి బంగారు, వెండి, నగదు దోచుకెళ్లారు. అదేరోజు కాకుమాని లేఅవుట్‌లో ఇంటి తాళం పగులగొట్టి బంగారు నగలు అపహరించుకువెళ్లారు. ఈనేపథ్యంలో వేసవి సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు ముందుగా తమకు సమాచారం అందించాలని, ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని పోలీసులు తెలుపుతున్నారు.



చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న మనుబోలు ఎస్ఐ రాకేష్

C.R.I.M.E N.E.W.S

స్నేహితుడే హంతకుడు!

● ఆర్థిక లావాదేవీలతోనే రియల్టర్ హత్య

● పోలీసులకు 'దృశ్యం' సినిమా చూపించిన నిందితుడు

● చివరికి చాకచక్యంగా వివరాలు వెలుగులోకి..

నెల్లూరు(క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటరెడ్డి నగర్‌లో జరిగిన రియల్టర్ హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుడి వివరాలను ఎస్పీ జి కృష్ణకాంత్ ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా అలియాస్ ఇస్సాక్ వెంకటరెడ్డినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, అక్కడే ఓ కార్యాలయాన్ని నడుపుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి కమీషన్ తీసుకుంటూ, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ రాత్రి చిన్నయ్య తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు రాజ ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

● ఆర్థికంగా నష్టపరిచాడని కక్ష పెంచుకొని

ఈ కేసును ఛేదించేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సూచనలతో నగర డీఎస్పీ సింధుప్రియ పర్యవేక్షణలో వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యతోపాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. మర్రిపాడు మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన సరస్వతి వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఉదయగిరిలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ టీచరు అయిన వెంకటేశ్వర్లు, మృతుడు చిన్నయ్య ఒకే ప్రాంతానికి చెందినవారు కావడంతో పరిచయం ఉంది. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లుతో మృతుడు చిన్నయ్య నమ్మకంగా ఉంటూ అతని వద్ద రూ.లక్షల నగదు తీసుకొని భాగస్వామ్య ఫైనాన్సు ప్రారంభించాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఏం అడిగినా చిన్నయ్య వ్యంగ్యమైన సమాధానం ఇస్తుండేవారు. అలాగే తనను నష్టపరచడంతోపాటు ఎంతో మంది ఉద్యోగులను మోసగించి వారి సొమ్మును కాజేసి ఫైనాన్సు వ్యాపారానికి మృతుడు మళ్లిస్తున్నాడని వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు.

● పథకం ప్రకారమే..

ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం నుంచి వెంకటరెడ్డినగర్‌లోని చిన్నయ్య ఇంట్లోనే వెంకటేశ్వర్లు నమ్మకంగా ఉన్నాడు. రాత్రి అదే ఇంట్లో బెడ్‌రూంలో నిద్రించాడు. అర్ధరాత్రి దాటాక హాలులోని సోఫాలో చిన్నయ్య నిద్రిస్తుండగా వెంకటేశ్వర్లు డంబెల్ తీసుకొని చిన్నయ్య ముఖ్యంపై కొట్టి, అక్కడే ఉన్న సోఫా దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. చిన్నయ్య మృతి చెందాడని నిర్ధారించుకున్న తర్వాత సోఫాపై కారం చల్లి, ఏమీ తెలియని వాడిలా బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు. మరుసటిరోజు ఉదయం చుట్టుపక్కల వారికి, కుటుంబ సభ్యులకు చిన్నయ్యను ఎవరో హత్య చేశాంటూ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేశాడు. చివరకు వెంకటేశ్వర్లు హత్య చేశాడని పోలీసులకు రుజువైన తర్వాత శుక్రవారం నెల్లూరు రూరల్ పడారుపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, రౌడీయిజం చేసే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసును ఛేదించిన వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య, అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందించారు.

● 'దృశ్యం' చూపెట్టాడు!

హత్య జరిగిన రాత్రి ఇంట్లో మృతుడితోపాటు నిందితుడు వెంకటేశ్వర్లు ఉన్నాడు. హత్య జరిగిన విషయం 6వ తేదీ తెల్లవారుజామున కింద ఫ్లోర్‌లో ఉన్న వారికి, మృతుడు కుటుంబసభ్యులకు నిందితుడు తెలియజేశాడు. అప్పుడే వారు హత్య జరిగినప్పుడు మీకు అరుపులు వినిపించలేదా అని ప్రశ్నిస్తే 'నాకు మెలకువ లేదు.. బెడ్‌రూమ్‌లో గాఢ నిద్రలో ఉన్నాను .' అని చెప్పాడు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటేశ్వర్లును విచారణలో ఎన్నిసార్లు ప్రశ్నించినా అవే సమాధానాలు ఇచ్చాడు. దృశ్యం సినిమాలో హీరో వెంకటేష్ నటించినట్లు సీరియస్ నటిస్తూ వచ్చాడు. చివరికి ఎస్పీ నేరుగా ప్రశ్నించినా అవే సమాధానాలు ఇచ్చాడు. దీంతో పోలీసులు పలు కోణాల్లో విచారించి, వెంకటేశ్వర్లే నిందితుడిగా పోలీసులు నిర్ధారించుకొని అరెస్ట్ చేశారు.


చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత



సంగం, (ఆంధ్రజ్యోతి): మం డలంలోని అరవపాళెంలోని చేపల గుంటలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరు నుంచి లారీలో సుమారు 70 డమ్ముల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారి పొట్టేయ్య, వీఆర్వో మోహన్ సమక్షంలో పోలీసులు చికెన్ వ్యర్థాలను సంగం కొండ వద్ద గుంత తీసి పూడ్చిపెట్టారు. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మురళి అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

సీతారామపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన స్థానిక ఆరులైన్ల జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య (63) రెండురోజుల క్రితం కట్టెల కోసం అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో దారితప్పి జాతీయ రహదారిపై వస్తూ మృతి చెందాడన్నారు. తల, శరీరంపై గాయాలు ఉండడంతో వెంగయ్య మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



జాతీయ రహదారి సమీపాన చెట్ల వద్ద పడి ఉన్న వెంగయ్య మృతదేహం

ఎస్ఐపై కేసు నమోదు

కావలి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎస్ఐ వెంకట్రావుపై కావలి 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. 1వ పట్టణ ఎస్ఐ సుమన్ కథనం మేరకు.. వెంకట్రావు కావలిలో ఎస్ఐగా పనిచేసిన సమయంలో పట్టణంలోని వివేకానంద పార్కు ప్రాంతానికి చెందిన ఓ వివాహితతో సన్నిహితంగా ఉండి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆ మహిళ ఈనెల 11వ తేదీన 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఎస్ఐ వెంకట్రావును కొండాపురం నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. ఆ మహిళ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260
కోడిగుడ్ల ధర (100):	525



19న యోగా మహోత్సవం

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 19న యోగా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నయాగో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు యజ్ఞేష్‌సింగ్, డైరెక్టర్ డాక్టర్ జేకే స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వంద రోజులు, వంద పట్టణాలు, వంద సంస్థలు అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. వీఎస్‌యూ, నారాయణ విద్యాసంస్థల సహకారంతో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయశంకర్, యోగా గురువులు ప్రసన్నకుమార్, రవీంద్ర, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ప్రపంచం.. మన గుప్పిట్లో

సమాచార రంగంలో సాంకేతిక విప్లవం కారణంగా నేడు ప్రపంచ మొత్తం గుప్పిట్లోకి వచ్చింది. ఒకప్పుడు దూర ప్రాంతాల్లో ఉండే వారితో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం కష్టతరంగా ఉండేది. ఇంటర్నెట్, సెల్‌ఫోన్ రాక ప్రపంచంలో ఏమూలనున్నా సమాచారం క్షణాల్లో తెలిసిపోతోంది.



- సెల్‌ఫోన్ రాకతో సంచలం
- క్షణాల్లో సమాచార వినిమయం
- నేడు వరల్డ్ టెలీకమ్యూనికేషన్ డే
- జిల్లాలో 28 లక్షల మంది మొబైల్ వినియోగదారులు

నెల్లూరు (సాంస్కృతికం), మే 16 (ఆంధ్రజ్యోతి) : పూర్వం ఎవరికైనా సమాచారం చేరవేయాలంటే మనుషులు నేరుగా వెళ్లి తెలియపరచడం గానీ, పక్షుల ద్వారా పంపడంగానీ జరిగేది. ప్రపంచంలో 1865లో కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రారంభమైంది. అప్పుడు టెలిగ్రామ్ ద్వారానే అత్యవసర సమాచారం పంచుకునేవారు. ఆ తర్వాత టెలిఫోన్ రాకతో తీగల ద్వారా మాట్లాడుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. మొబైల్ రాక సమాచార వ్యవస్థలో పెను విప్లవానికి దారి తీసింది. తీగలే లేకుండా ఇంటర్నెట్ వినియోగం, శాటిలైట్ ద్వారా సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం చాలా సులభమైంది. ఒకరి నుంచి ఒకరికే కాకుండా ఒకేసారి ఎక్కువ మందితో సంభాషించే, సమాచారాన్ని పంచుకునే సదుపాయం వచ్చింది. మొబైల్స్, ఇంటర్నెట్ ద్వారా క్షణాల్లో లక్షలాది మందికి సమా చారం అందుతోంది. అదే విధంగా ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా వేగంగా తెలిసిపోతోంది.

1965లో అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ సొసైటీ ఏర్పడింది. ప్రతీ ఏడాది మే 17వతేదీన ప్రపంచ టెలికాం దినోత్సవం జరుపుకోవాలని ఆ సొసైటీ నిర్ణయించింది. 1969లో ఇండియా ఆ సొసైటీలో సభ్యత్వం పొందింది. ఇక, జిల్లా విషయానికి వస్తే ప్రస్తుతం జిల్లా జనాభా 33 లక్షలు కాగా దాదాపు 28 లక్షల మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నారు. 2జీ నుంచి 5జీ స్థాయిలో టెలీకమ్యూనికేషన్స్ సాగుతున్నాయి. వరల్డ్ టెలికామ్ దినోత్సవం సందర్భంగా వరల్డ్ టెలీ కమ్యూనికేషన్ సొసైటీ ఈ ఏడాదికి డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం ఎందుకు ముఖ్యమైంది అనే థీమ్ అందించింది. డిజిటల్ రంగంలో స్త్రీ, పురుష లింగ బేధాన్ని రూపమాపడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది.



జిల్లాకు డిజిటల్ ఇండియా పథకం

కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా పథకాన్ని ఉమ్మడి నెల్లూరు జిల్లాకు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు టెలీకమ్యూనికేషన్ సేవలు అందని 112 పల్లెలను గుర్తించాం. వాటిలో నెల్లూరు జిల్లాలో 72 గ్రామాలు, తిరుపతి జిల్లాలో 40 గ్రామాలున్నాయి. నెల్లూరు జిల్లాలో 60 గ్రామాలు, తిరుపతి జిల్లాలో 18 గ్రామాల్లో టవర్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించాము. మిగిలిన గ్రామాల్లో కలెక్టర్లు స్థలాలు కేటాయిస్తే 6 నెలల్లో 4జీ టవర్లు ఏర్పాటు చేస్తాము.

- మిట్టా శ్రీనివాసరావు బీఎస్ఎన్ఎల్ డీజీఎం

జీజీహెచ్ పారిశుధ్యంలో
అవినీతి, అక్రమాలు

- పీఎఫ్ పేరిట వసూళ్లు
- ఫేక్ సర్టిఫికెట్లతో మోసం
- డిప్యూటీ కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు
- 14 మంది కార్మికులకు అందని వేతనాలు
- ఏజైల్ ఏజెన్సీ తీరుపై విమర్శలు

నెల్లూరు (వైద్యం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఏసీ సుబ్బారెడ్డి వైద్య కళాశాలలో పారిశుధ్య నిర్వహణలో అవినీతి బాగోతాలు ఒక్కొక్కటి బయట పడుతున్నాయి. పారిశుధ్య కార్మికుల వేతనాల చెల్లింపులో ఏజైల్ ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి. నెల రోజులు పనిచేస్తే పది రోజులే పని చేసినట్లు రికార్డుల్లో చూపిస్తూ జీతాల్లో కోత విధిస్తున్నారని, మిగిలిన సొమ్మును స్వాహా చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికుల పేరిట ఫేక్ విద్యార్హత సర్టిఫికెట్లు సృషించి డబ్బు వసూలు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏజైల్ ఏజెన్సీకి ప్రభుత్వం ఏడాది రూ.10 కోట్ల వరకు చెల్లిస్తుంటే ఇందులో పెద్ద మొత్తంలో పారిశుధ్య కార్మికుల పేరిట అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పారిశుధ్య విభాగంలో అక్రమాలపై గురువారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించడంతో, ఇంతకాలం బయటకు వచ్చేందుకు భయపడ్డ పారిశుధ్య కార్మికులు ఇప్పుడు బయటకు వచ్చి ఏజెన్సీ నిర్వాహకుల మోసాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. పీఎఫ్ పేరిట ఏడుగురు కార్మికుల నుంచి రూ.96 వేల వరకు ఏజెన్సీ నిర్వాహకులు వసూలు చేసి మోసం చేశారని, ఆ డబ్బును ఇప్పించాలని డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డికి శుక్రవారం వినితి పత్రం ఇచ్చారు. దీనిపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. ఇలాంటి అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేస్తే మరిన్ని వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.



పీఎఫ్ నగదు ఇప్పించాలని డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

- ఐదు నెలలుగా జీతం బకాయి

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తన నియోజకవర్గం నుంచి సునీత అనే మహిళను జీజీహెచ్‌లో పారిశుధ్య కార్మికురాలిగా తీసుకోవాలని ఏజైల్ ఏజెన్సీకి సిఫార్సు చేశారు. ఆ కార్మికురాలు గత ఏడాది డిసెంబరులో విధుల్లో చేరింది. కానీ నేటికీ ఆమెకు వేతనం చెల్లించలేదు. విధుల్లో చేరి ఐదు నెలలైనా జీతం చెల్లించలేదని బాధితురాలు మేనేజర్‌ను ప్రశ్నించింది. రికమెండేషన్‌తో వచ్చిన నీకు వేతనాలు ఎలా చెల్లిస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పినట్లు తెలిసింది. ఇదేవిధంగా పారిశుధ్య సూపర్వైజర్ సాయినిఖిల్, మాజీ మేయర్ భానుశ్రీ చేర్పించిన సుప్రజ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే సిఫార్సు చేసిన పారిశుధ్య కార్మికులు కలిపి సుమారు 14 మందికి వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే కొందరు కార్మికుల వేతనాలకు సంబంధించి రికార్డులు తారుమారు చేసినట్లు విమర్శలున్నాయి. ఇలా ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు నెలల వేతనాలు రాలేదు : లలితమ్మ, పారిశుధ్య కార్మికురాలు



నేను ఎనిమిదేళ్లగా పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నాను. అనా రోగ్యంతో సంవత్సరం రోజులు విధులకు రాలేదు. ఈ ఏడాది మార్చి 7న మరలా చేరాను. మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి జీతం ఇప్పటివరకు చెల్లించలేదు. హాజరు పట్టీలో నాపేరు, సంతకాలు, హాజరు ఉన్నాయి. కానీ ఏజైల్ సంస్థ మేనేజర్ మాత్రం విధులకు హాజరు కాలేదంటున్నారు. ఇది చాలా అన్యాయం. నాకు రెండు నెలల జీతం ఇప్పించండి.

రేపు ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం గొలగమూడిలోని ఫన్ పార్క్ కన్వెన్షన్ హాలులో జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆ వేదిక వద్ద ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ మాట్లాడుతూ రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని ర్యాంకుల క్రీడాకారులు, ఫిడే రేటింగ్ క్రీడాకారులు హాజరవుతున్నారని, వీరికి ఉచిత, భోజన, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేస్తామన్నారు. పోటీలకు హాజరయ్యే బాల, బాలికలకు ఒక గంట పాటు వాటర్ రైడ్స్ ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫన్‌పార్క్ ఎండీ పొత్తూరి సాయి, టోర్నీ నిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెస్ పోటీల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

న్యాయవాది అరుణ మృతి



నెల్లూరు (లీగల్), మే 16 (ఆంధ్రజ్యోతి) నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది రామిశెట్టి అరుణకుమారి అనారోగ్యంతో శుక్రవార ం మరణించారు. ఆమె భర్త సీనియర్ న్యాయవాది సోడే నాగేశ్వరరావు. ఆయన కరోనా సమయంలో మృతి చెందారు. అరుణ రెండు దఫాలుగా జిల్లా కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ఆమె ఆకస్మిక మృతికి రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలువురు న్యాయవాదులు నివాళి అర్పించారు.

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో 1200లోపు ఓటర్లు

- నగర కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 16 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో 1200లోపు ఓట్లు ఉండే విధంగా ప్రణాళికలు తయారు చేస్తున్న ట్లు కార్పొరేషన్ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నందన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. ప్రతీ ఓటరుకు కనీసం 2 కి.మీ. పరిధిలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన వారంతా ఒకే దగ్గర ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. తాజా నూతన అంశాలపై బీఎల్వోలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



పార్టీల ప్రతినిధులు, అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

నెల్లూరు లోని డిగ్రీ కళాశాలల్లో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా 9వ డివిజన్ పరిధిలోని నజీర్‌తోట, కుసుమ హరిజనవాడ, ఎఫ్‌సీఐ కాలనీల్లో పారిశుధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. 16వ డివిజన్‌లోని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను ఎంహెచ్‌వో చైతన్య పరిశీలించారు.

నిత్య అన్నదాన పథకానికి రూ.1లక్ష విరాళం

నెల్లూరు (సాంస్కృతికం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదాన పథకానికి అజ్ఞాత భక్తుడు శుక్రవారం రూ.1,01,000 విరాళంగా ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డికి అందజేశారు. శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం అభిషేకాలు, నవావరణ పూజలు, సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. సాయంత్రం పుష్పాలంకరణ, విశేష పూజలు జరిగాయి.



విశేష అలంకరణలో అమ్మవారు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

ఉపాధ్యాయ బదిలీల్లో
దివ్యాంగులకు అన్యాయం

వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు కోదండరామయ్య

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయల బదిలీలకు దివ్యాంగుల చట్టం అమలు చేయకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందని జిల్లా శారీరక వికలాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జీ కోదండరామయ్య ఆరోపించారు. నగరంలోని దర్గామిట్ట ఎంసీయూపీ పాఠశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సంస్కరణల పేరుతో విద్యావ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రశ్నార్థకంగా ఉన్నాయన్నారు. ఉద్యోగుల బదిలీల చట్టంలో ప్రకటించిన అంశాల కారణంగా దివ్యాంగ ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. వికలాంగుల చట్టం ప్రకారం అన్ని కేటగిరిల్లో 40 శాతం బెంచ్‌మార్క్‌గా నిర్ణయించి ప్రిఫరెన్షియల్ క్యాటగిరిలో ఉన్న దివ్యాంగ ఉపాధ్యాయులు పర్సంటేజీ ప్రకారం ఆప్షన్ పెట్టుకునే సమయంలో ఆంక్షలు విధించడం తమను కించపరచడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీలపై న్యాయస్థానంలో కేసు నడుస్తున్నందున కోర్టు తుది తీర్పునకు లోబడి బదిలీలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఎం నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంచలయ్య, కోశాధికారి ఏ హరి, సభ్యులు రియాజ్, శీనయ్య, మురళి, మృదుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులు

విద్యాశాఖ జీవోలతో ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో సంస్క రణల పేరుతో విద్యావ్యవస్థలో తీసుకుంటున్న నిర్ణయాలతో ఇబ్బందులు తప్పవని ఆర్‌టీపీ అధ్యక్షుడు షేక్ ఖాజా రహంతుల్లా ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా జీఓ నెంబరు 117కు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 19, 20, 21 ద్వారా ఉపాధ్యాయుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సి ఉండగా దీనికి విరుద్ధంగా సెక్షన్‌కు 53 మంది పిల్లలు ఉండాలనే నిబంధన విధించడాన్ని అందరం వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులను ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌ఏలతో భర్తీ చేయాలనే అశాస్త్రీయ నిర్ణయాన్ని విరమించు కోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉర్దూ బోధించే పాఠశాలలపై నిర్లక్ష్యం తగదని, పోస్టుల కేటాయింపు సమానంగా జరగాలని డిమాండ్ చేశారు.

19 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఈనెల 19 నుంచి 22వతేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపకుడు చెన్నూరు వెంకటేశ్వర రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో 19వతేదీ రాత్రి అంకురార్పణ, 20 ఉదయం అభిషేకాలు, హోమాలు, 21న అభిషేకాలు, హోమాలు జరుగుతాయన్నారు. 22న హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం అభిషేకం, హోమం, లక్ష మల్లెల పూజ, పూర్ణాహుతి, రాత్రి నగరోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 6గంటల నుంచి 72 గంటల పాటు విజయవాడ హనుమాన్ దీక్షా పీఠం వారితో హనుమాన్ చాలీసా అఖండ పారాయణం మొదలైంది.

డంపింగ్ యార్డులో చేతి పంపు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆమంచర్ల డంపింగ్ యార్డులో శుక్రవారం నవజీవన్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కే సహదేవయ్య చేతి పంపు ప్రారంభించారు. డంపింగ్ యార్డులో 31 సంవత్సరాలుగా 31 గిరిజన (యానాదుల) కుటుంబాలు చెత్త ఏరుకుని జీవిస్తున్నాయని, వారికి తాగునీటి వసతి కోసం చేతి పంపును ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ కే పెంచలయ్య, సిబ్బంది, శ్రీనివాసులు, సోజ, రాము, విస్టేజీ ప్యాకర్స్ పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని జెండావీధికి చెందిన లియాకు చెన్నై నగరానికి చెందిన పర్వేజ్‌తో వివాహమైంది. వివాహ సమయంలో లియా కుటుంబ సభ్యులు కట్నకానుకుల కింద రూ.7లక్షల నగదు, 25 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల విలువ చేసే గృహోపకరణాలు ఇచ్చారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగినా ఆ తర్వాత భర్త, అత్తింటివారు అదనపు కట్నం కోసం లియాను వేధించడం ప్రారంభించారు. వారి వేధింపులు తాళలేని బాధితురాలు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంట్లో కారం కొట్టి మహిళ మెడలో గొలుసు అపహరణ

వెంకటాచలం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ కంట్లో కారం కొట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుని వెళ్లిన సంఘటన వెంకటాచలం పంచాయతీ వడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు వడ్డిపాలెం గ్రామానికి చెందిన ఉప్పు రత్నమ్మ తన నివాసంలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రత్నమ్మ కంట్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న 3 సవర్ల బంగారు గొలుసును లాక్కొని అక్కడ నుంచి పరారయ్యాడు. దీంతో బాధితురాలు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాహనదారులకు చల్లగా..

నగరంలోని రైల్వే క్రాసింగ్‌ల వద్ద వేచి ఉండే సమయంలో ప్రయాణికులు ఎండలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు కార్పొరేషన్ అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. రంగనాయకులపేట రైల్వే క్రాసింగ్ వద్ద శుక్రవారం వాహనాలు నిలిచే ప్రదేశం వద్ద పచ్చటి పట్టతో పందిరి వేశారు. ఇది వాహనాదారులకు ఉపశమనాన్నిస్తోంది.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

పొట్టిశ్రీరాములు జయంతి ఉత్సవాలకు రండి

నెల్లూరు (సాంస్కృతికం), మే 16 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలకు రాజకీయాలకు అతీతంగా, కులమత భేదాలు లేకుండా జిల్లా ప్రజలు తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి షేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దర్శి హరికృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లూరుజిల్లా రైస్ క్యాన్వాస్ ఏజెంట్స్ అసోసియేషన్ హాలులో ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10గంటలకు స్టోన్‌హౌస్‌పేట అరుణాచలం వీధిలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో జయంతి ఉత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, అమరజీవి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. పొట్టిశ్రీరాములు125వ జయంతి వేడుకలు 365 రోజులు నిర్వహిస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆంజనేయులు, మెంటా వీరబ్రహ్మం గుప్తా, భవనాపి సురేష్‌బాబు, కోట సత్యనారాయణ, సోమిశెట్టి రమేష్, జొన్నలగడ్డ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు జయంత్యుత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

క్రీడాకారులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు హాజరైన క్రీడాకారులకు వాకర్స్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరాం ప్రసాద్, రీజనల్ కౌన్సిలర్ ఎం వెంకటాద్రిరెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. వాకర్స్ సంఘం సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసు లు నాయుడు, కార్యదర్శి జీ నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, సభ్యులు, వాకర్స్ పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో ఏపీజీఈఏ మహాసభలు

నెల్లూరు(హరనాథపురం), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర మహా సభలు జూన్ 5, 6 తేదీల్లో విజయవాడలో జరుగుతాయని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏనుగ రమణారెడ్డి తెలిపారు. ఈ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం నగరంలోని ఏపీజీఈఏ కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్ర మహా సభలకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బీ సుధాకర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చింగీషా, నగర విభాగం నాయకుడు ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరీశుడికి పుష్పయాగం



స్వామి వారికి పుష్పయాగం చేస్తున్న అర్చకులు

ఏకాంతసేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్, మే 16,(ఆంధ్ర జ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామికి శుక్రవారం పుష్పయాగం నేత్ర పర్వంగా జరిగింది. పది రోజుల నుంచి అంగరంగ వైభవంగా జరిగిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఏకాంత సేవతో ముగిశాయి. చివరి రోజు విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. విశాఖకు చెందిన సౌభాగ్య భువనేశ్వరీ పీఠం నుంచి రామానంద భారతి స్వామి వారు ఆలయానికి విచ్చేసి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి చెప్పారు. దేవస్థానంలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ఎంపీ వీపీఆర్, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నిత్యం అధికారులను సమన్వయం చేసుకుని ఎక్కడా లోపాలు రానివ్వకుండా భక్తులకు సర్వసౌకర్యాలు కల్పించారని తెలిపారు.



జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సురేష్, తదితరులు

భారత్ మాతాకీ జై!

వింజమూరులో తిరంగా విజయోత్సవ ర్యాలీ

భారత్ మాతాకీ జై... జై జవాన్.. జయహో భారత్! అంటూ విద్యార్థుల నినాదాలతో వింజమూరు హోరెత్తిపోయింది. ఆపరేషన్ సిందూర్ విజయం సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. 70 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో మంగళ సెంటర్ నుంచి శివాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, మాలేపాటి చైతన్య, మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులతోపాటు తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతోపాటు విద్యార్థులు, యువత భారీ ఎత్తున పాల్గొన్నది.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



నేడు బీట్ ద హీట్

ప్రజలకు అవహన కల్పించాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్



నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'బీట్ ద హీట్'లో అన్నీ శాఖల అధికారులు ప్రజలకు వేసవిలో ఉపశమనం కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎండ వేడిమి నుంచి సురక్షితంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ప్రముఖ, రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్స్, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయటం, మొక్కలు నాటేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు.

చెక్, క్లీన్, కవర్

- డెంగ్యూ నివారణకు కార్యాచరణ
- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత
- నెల్లూరులో ప్రత్యేక ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు, సిబ్బంది, పీఎంపీలు తదితరులు

నెల్లూరు (వైద్యం), మే 16 (ఆంధ్రజ్యోతి) : చెక్, క్లీన్, కవర్ విధానంతో డెంగ్యూ వ్యాధి నివారణ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. డెంగ్యూ నివారణ దినం సందర్భంగా శుక్రవారం నెల్లూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి గుప్తా పార్క్ వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. డెంగ్యూ నివారణకు కృషి చేస్తామం టూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఈజిప్టయ్ అనే దోమ వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకుతుదని చెప్పారు. కంటి నొప్పి, కండ్లు ఎర్రబారటం, కండరాల నొప్పులు, జుట్టు ఊడిపోవటం, చర్మంపై ఎర్రటి గుండ్రటి మచ్చలు, తీవ్ర జ్వరం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వం వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగ్యూ నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ఇంటి చుట్టూ దోమల ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలు లేకుండా చెక్ చేసుకోవాలన్నారు. నిల్వలను వెంటనే తొలగించి క్లీన్ చేయాలని, అలాగే నీటి తొట్టెలు, డబ్బాలు వంటి వాటిపై మూతలు ఉండేలా కవర్ చేయాలని సూచించారు. ఈ మూడు పద్ధతులు తప్పకుండా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డెమో కనకరత్నం, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు, జిల్లా పీఎంపీ అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాక్షిక దత్తత కోసం నమోదు చేసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న చైల్డ్‌కేర్ కేంద్రంలో ఉన్న పిల్లలను పాక్షిక దత్తత తీసుకోడానికి ఆసక్తిగల తల్లిదండ్రులు నమోదు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కేంద్రంలోని 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలను పాక్షిక దత్తత తీసుకోడానికి ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో ఉన్న బాలల సంక్షణాధికారిని సంప్రదించాలని కోరారు.

రక్తపోటు పట్టిక	సాధారణం	స్టేజ్-1	స్టేజ్-2	స్టేజ్-3
	120/80	140/90	160/100	180/110 అంతకంటే ఎక్కువ

ఒత్తిడి పెంచుకోవద్దు!

- ఎక్కువైతే రక్తపోటు బారిన పడ్డట్టే!
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే
- బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం
- జిల్లాలో 4 లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్థులు
- నేడు ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవం



ఉరుకులు పరుగుల జీవితం. పొద్దున లేచింది మొదలు అర్ధరాత్రి పడుకునే వరకు ఒత్తిడి. భవిష్యత్తుపై ఆందోళన. జీవితంలో ఎక్కడ ఏ అంచనాలు తప్పినా ముంచుకొచ్చే కోపతాపాలు, నిరాశ నిస్పృహ.. ఫలితంగా నరాల్లో పోటెత్తే నెత్తుటి వేగం అదుపుతప్పి రేకెత్తించే అలజడి. వైద్య పరిభాషలో చెప్పాలంటే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు). సాధారణ భాషలో దీనినే బీపీ అని కూడా అంటారు. ఆదిలోనే దీనిని అదుపు చేయకపోతే ప్రాణాంతకంగా మారుతుంది.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

నేటి సమాజంలో మనిషి అలవాట్లు, ఆహారపు పద్ధతుల వల్ల అనేక ప్రాణాంతక రోగాల బారినపడుతున్నారు. మధుమేహం తర్వాత ప్రమాదకరమైన రక్తపోటుకు బారిన పడుతున్నారు. ఇది శరీమంతా వ్యాపించి ప్రధాన అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది పట్టణవాసుల్లేనే ఎక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 82 వేల మంది బాధితులు ఉన్నారు అయితే జిల్లాలో 4 లక్షల మందికిపైగా రక్తపోటు వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చిన్నపెద్ద అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రక్తపోటు బారిన పడుతున్నారు. రక్తపోటుపై నిర్లక్ష్యం చేస్తే అది గుండెపోటుకు కూడా దారి తీసే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. వ్యాధి వల్ల మూత్ర పిండాలు, కంటి జబ్బు లు వచ్చే అవకాశం ఉందని, ప్రధాన అవయవాలను దెబ్బతీస్తుందని స్పష్టం చేస్తున్నారు.



● ప్రతి వంద మందిలో 15 మందికి..

ఈ రక్తపోటు వల్ల తీవ్ర అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. బ్రెయిన్‌లో రక్తనాళాలు చిట్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రతి వంద మందిలో 15 మంది దాకా గ్రామాలలో వ్యాధిగ్రస్థులు ఉండగా పట్టణ ప్రాంతాలలో 20 మందికిపైగా ఆ సంఖ్య ఉంటోంది.

నివారణ ఇలా..

- ఆహారంలో తీసుకునే రోజువారి ఉప్పు 5 గ్రాముల కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి.
- ఆహారంలో కొవ్వు పదార్థాల పరిమితి మించకూడదు.
- అధిక బరువు ఉన్నట్టయితే బరువు తగ్గేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.
- క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేస్తూ ఉండాలి.
- మద్యం తాగే అలవాటు ఉంటే మోతాదు మించకుండా చూసుకోవాలి.
- పొగ తాగడం పూర్తిగా మానివేయాలి.
- రక్తపోటు ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండాలి.
- అధిక రక్తపోటు ఉన్నట్టయితే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

రక్తనాళాలపై దీని ప్రభావం ఎక్కువే



బీపీ ప్రభావం ఎక్కువగా రక్తనాళాలపై ఉంటుంది. శరరంలోని ప్రధాన రక్తనాళాలు అధిక రక్తపోటు వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. రక్తపోటు పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. అధిక రక్తపోటు వల్ల ఒక్కోసారి మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. రక్తనాళాలులో కొవ్వు పేరుకుపోయి రక్తం సరఫరా ఆగిపోయి కూడా బ్రెయిన్ స్ట్రోకుకు గురయ్యే ప్రమాదం ఉంది. జిల్లాలో వ్యాధిగ్రస్థులు 4 లక్షల మందికిపైగా ఉన్నారు.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేధిక రాష్ట్ర అధ్యక్షుడు

అప్రమత్తంగా ఉండాలి



రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అప్రమ త్తంగా ఉండాలి. రక్తపోటుపై నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరుగుతుంది. ఇది శరీరంలోని అనేక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపు తుంది. ప్రధానంగా అధిక రక్తపోటు కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధిపై నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ డయాలసిస్‌కు దారి తీస్తుంది. దీర్ఘకాలకంగా బీపీ ఉండి నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు దెబ్బతింటాయి. సడన్‌గా వచ్చే హై బీపీని మందులతో నయంచేసుకునే అవకాశం ఉంది. వైద్యులను సంప్రదించి వ్యాధిని కంట్రోల్‌లో పెట్టుకోవాలి.

- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ వైద్యాధికారి

నెల్లూరులో బాధితులు సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. రక్తపోటుపై అవగాహన లేకపోవడంతో తీవ్ర వ్యాధులకు గురవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు విధిగా చేయించుకుని తగిన వైద్య చికిత్సలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోషరావు

వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయండి

- పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి
- విద్యుత్ సీఎండీ సంతోషరావు

నెల్లూరు (జడ్పీ), మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను మంజూరు చేయాలని జిల్లా విద్యుత్ అధికారులను సీఎండీ సంతోషరావు ఆదేశించారు. శుక్రవారం నెల్లూరుకు వచ్చిన ఆయన విద్యుత్‌భవన్‌లో అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని, పెండింగ్ కనెక్షన్లను వెంటనే మంజూరుచేయాలన్నారు. వేసవిలో నిరంతర సరఫరా పటిష్టంగా చేయాలన్నారు. సౌరవిద్యుత్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించి, పెద్ద ఎత్తున చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది స్థానిక హెడ్ క్వార్టర్‌లో నివాసం ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నాయని, దీనికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురవయ్య, ఎస్ఈ విజయన్, నోడల్ అధికారి బాలచంద్ర, ఈఈలు ఎం. శ్రీధ ర్, సోమశేఖర్‌రెడ్డి, రమేష్ చౌదరి, శ్రీనువాసులు, లక్ష్మీనారాయణ, పరంధామయ్య పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్ల మందగమనం

- పురోగతి లేని ధరలు ● నిరాశలో రైతులు



గిట్టుబాటు ధర కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

మర్రిపాడు, మే 16 (ఆంధ్ర జ్యోతి): వేలం కేంద్రాల్లో వ్యాపారులు ఆచితూచి వ్యవహరిస్తుండడంతో పొగాకు కొనుగోళ్లు మందగమనంగా సాగుతున్నాయి. కొనుగోళ్లు మొదలై రెండు నెలలు గడుస్తున్నా పొగాకు ధరల్లో పురోగతి కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. గత ఏడాది మంచి ధరలు లభించడంతో పోటీపడి అధికంగా ఖర్చుచేసి పరిమితిని మించి పొగాకును సాగుచేశారు. తీరా అన్ని రకాల బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. ఎక్కువ సంఖ్యలో తిరస్కరణకు గురవుతున్నాయి. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా తమ వద్ద నిల్వ ఉన్న పొగాకు బరువు తగ్గి, రంగు మారి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని కర్షకులు కలవపడుతున్నారు.

5861.91 హెక్టార్లలో పొగాకు సాగు

మర్రిపాడు మండలంలోని డీసీపల్లి బోర్డు పరిధిలో 1738.42 పొగాకు బ్యారన్‌లు ఉండగా 2069 మంది రైతులు 5861.91 హెక్టార్లలో పొగాకు సాగుచేశారు. రైతులు 7.41 మిలియన్ కేజీలకు అనుమతి పొందగా, 10.60 మిలియన్ కేజీల మేర దిగుబడి వచ్చినట్లు తొలుత అధికారులు అంచనా వేశారు. కానీ అందుకు భిన్నంగా పంట రైతు చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఆశించిన మేర ధరలు లేవంటూ గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు నిరసన వ్యక్తంచేసి తమ గోడును అధికారులకు విన్నవించుకున్నారు. ప్రతీరోజూ వేలం కేంద్రం నుంచి 100 బేళ్లకు పైగా తిరస్కరణకు గురవుతున్నాయని, శుక్రవారం వేలం కేంద్రానికి 540 బేళ్లు రాగా 117 బేళ్లను తిరస్కరించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు.

అక్రమ మైనింగ్ నిగ్గు తేల్చండి

- కలెక్టర్‌కు వైసీపీ ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), మే 16 (ఆంధ్రజ్యోత) : సైదాపురంలో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, నెల్లూరు నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఇసుక తరలిం పుపై నిగ్గు తేల్చాలని వైసీపీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆ పార్టీకి చెందిన వెంకటగిరి నియోజకవర్గ సమ న్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అక్రమాలు కొనసాగితే కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో పామూరురోడ్డు సర్కిల్‌లో రీసర్వే



పామూరురోడ్డు సర్కిల్‌లో మాదాల మోహనరావు ఇంటివద్ద సర్వే నిర్వహిస్తున్న ఉన్నతాధికారులు

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరు రోడ్డు సర్కిల్‌లో సర్వే ఉన్నతాధికారులు శుక్రవారం రీ సర్వే నిర్వహించారు. సర్కిల్ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ పదిహేను రోజులక్రితం మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టి పలు గృహాల ప్రహరీగోడలు, ఆక్రమితస్థలంలో ఉన్నట్లు భావించిన నిర్మాణాలను కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే ఆక్రమణల తొలగింపు పేరుతో అక్రమంగా మా నిర్మాణాలను కూల్చివేశారని, వాస్తవానికి మేము ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని ఉన్నతాధికారులతో రీ సర్వే చేయించాక ఆక్రమణల తొలగింపు చేయాలని కొందరు బాధితులు కోరినా మున్సిపల్ అధికారులు పెడచెవిన పెట్టి ఏకపక్షంగా కూల్చివేతలకు పాల్పడ్డారని సవాల్‌చేస్తూ మాదాల మోహనరావు అనే వ్యక్తి హైకోర్టులో రిట్‌పిటీషన్ దాఖలు చేశారు. దీంతో సర్కిల్ అభివృద్ధి పనులపై స్టే విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఉన్నతస్థాయిలో సమగ్రంగా సర్వేచేసి నివేదిక ఇవ్వాలని అప్పటి వరకు ఎలాంటి ఆక్రమణల తొలగింపుకు పాల్పడవద్దని సూచిస్తూ 8వారాల స్టే విధించింది. హైకోర్టు ఆదేశాలతో శుక్రవారం సర్వేశాఖ ఏడీ రఘురామరాజు కందుకూరు డీఐ ప్రభాకర్, మండల సర్వేయరు మాటూరి శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బందిని వెంటబెట్టుకుని సర్వే నిర్వహించారు. పట్టణంలోని పామూరు రోడ్డులో పొగాకు బోర్డు నుంచి రిలయన్స్ మార్ట్ వరకు రోడ్డుకి ఇరువైపులా సర్వే చేశారు. గతంలో రెండు దఫాలు సర్వేజరిగి ఉందని తొలుత మండల సర్వేయరు సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారని, మరో విడత డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేస్ నిర్వహించిన సర్వేలో తొలుత నిర్ధారించిన హద్దుల కన్నా మరో మూడు అడుగుల వరకు ఆక్రమణ ఉన్నట్లు నిర్ధారించారని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే హైకోర్టు ఆదేశాలతో జరుగుతున్నందున సమగ్రంగా వాస్తవ పరిస్థితిని, హద్దులను, ఆక్రమణలను నిర్ధారిస్తూ నివేదికను ఉన్నతాధికారుల ద్వారా కోర్టుకు నివేదిస్తామని, కోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

19 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

నెల్లూరు(విద్య), మే 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈనెల 19 నుంచి నిర్వహిస్తున్న ట్లు ఆర్‌ఐవో టీ వర ప్రసాద్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు శనివారంతో పూర్తి కానున్నాయని, ఎగ్జామినర్లుగా నియమితులైన అధ్యాపకులను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు రిలీవ్ చేసి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి పంపించాలని సూచించారు. మొదటి స్పెల్‌లో 19వతేదీ నుంచి సంస్కృతం, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టులు, రెండో స్పెల్‌లో 21వతేదీ నుంచి ఫిజిక్స్ ఎకనామిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, బోటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టుల జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుందని వెల్లడించారు. మూల్యాంకన విధులకు హాజరుకాని సిబ్బందిపై బోర్డు నిబంధనలకు అనుగుణంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● 535 మంది గైర్హాజరు..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం ఫిజిక్స్-1, 2, ఎకనామిక్స్-1, 2 పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 535 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 7,803 మంది హాజరు కావాల్సి ఉండగా 7,323 మంది హాజరుకాగా 480 మంది గైర్హాజర య్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1058 మంది హాజరు కావాల్సి ఉండగా 1003 మంది హాజరుకాగా 55 మంది గైర్హాజర య్యారు. ఆర్‌ఐవో టీ వరప్రసాదరావు 17 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 9, ఫ్లయింగ్ స్క్వాడ్ 26 కలిపి మొత్తం 52 కేంద్రాలను పరిశీలించారు.

సహకార సంఘాల సీఈవోలకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), మే 16(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఎన్‌డీసీసీబీ సమావేశ మందిరంలో సహకార సంఘాల సీఈవోలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా సహకారశాఖాధికారి గురప్ప వాయిదా మీరిన బకాయిలపై చట్టపరమైన చర్యలు అనే అంశంపై వివరించారు.

నేడు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ఉదయగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో శనివారం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తుఫారం, ఆధార్, రేషన్‌కార్డు, కుల్రదువీకరణ తదితర పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8998
వెండి కిలో ధర	రూ. 98,000
వెండి ఒక గ్రాము	రూ. 101.00

శిథిలావస్థలో వంతెనల రక్షణ గోడలు

ప్రమాదాల బారిన వాహన చోదకులు

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

సంగం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు కాలువలపై ఉన్న వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు శిథిలమై ప్రమాదకరంగా ఉన్నాయి. రక్షణ గోడలు, కమ్ములు లేకపోవడంతో వాటిపై రాకపోకలు సాగించే పశువులు, జీవాలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని బెజవాడ పాపిరెడ్డి కాలువ కనిగిరి ప్రధాన కాలువ నుంచి ప్రారంభమవుతుంది. ప్రారంభం వద్ద కాలువను దాటేందుకు ఏకవరుస వంతెన నిర్మించారు. సంగం గ్రామానికి చెందిన రైతులు ఈ వంతెన మీదనే పొలాలకు వెళ్లాలి. అదేవిధంగా పశువులు, జీవాలు కూడా ఈ వంతెన మీదనే మేతకు వెళ్తుంటాయి. అయితే ఇది నిర్మించి నాలుగు దశాబ్దాలు కావడంతో వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు పూర్తిగా శిథిలమై పోయాయి. ఎటువంటి ఆధారం లేదు. ఈ కాలువ సుమారు 15 అడుగుల లోతు ఉంటుంది. ఎప్పుడూ 10 అడుగుల మేర నీళ్లు పారుతుంటాయి. అదేవిధంగా వెంకటేశ్వరపురం వద్ద దువ్వూరు కాలువపై వంతెనకు రక్షణ గోడ దెబ్బతిని పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉంది.



రక్షణ గోడలేక ప్రమాదకరంగా ఉన్న బెజవాడ పాపిరెడ్డి కాలువ వంతెన

సంగం పాత ఆనకట్టకు దక్షిణవైపు నెల్లూరు చెరువు కాలువ వంతెనపై రక్షణ గోడ పూర్తిగా ధ్వంసమైంది. ఇక్కడ కాలువ సుమారు 20 అడుగుల లోతు ఉంది. అనసూయనగర్ వద్ద బ్రాంచ్ కాలువపై ఉన్న వంతెనకు రక్షణ గోడ పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం

కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడలు (కమ్ములు) దెబ్బతినడంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అటువైపు వెళ్లే పశువులు పొడుచుకుని కాలువలో పడిపోతున్నాయి. కాలువకు లైనింగ్ చేసి ఉండడంతో పైకి ఎక్కి వచ్చేందుకు అవకాశం లేదు. ఈ వంతెన మీద ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి నీటిలో పడిన సంఘటనలు ఉన్నాయి. ఓసారి బెజవాడ పాపిరెడ్డి కాలువపై ఉన్న వంతెన రక్షణ గోడలు లేకపోవడంతో ట్రాక్టర్ అదుపుతప్పి నీటిలో పడిపోయింది. వెంకటేశ్వరపురం వద్ద దువ్వూరు కాలువపై ఉన్న వంతెన గోడలు పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా ఉంది.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

వంతెన రక్షణ గోడలు శిథిలమై ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, రైతులు విమర్శిస్తున్నారు. పలుమార్లు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు కానీ నిధులు మంజూరయిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాలువల రక్షణ గోడలను పటిష్ట పరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య ఆరోగ్య సిబ్బంది ఉదయగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారిణి శివకల్పన మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్, హెచ్‌ఈవో వెంకటసుబ్బయ్య, టీబీ పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): డెంగ్యూ నివారణ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం వైద్యాధికారిణి ఆయేషా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులను దూరం చేసుకోవాలన్నారు. అలాగే జ్వరం వచ్చిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి డెంగ్యూ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, సూపర్‌వైజర్ వెంకటయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్స్ రోజారమణి, ఎల్‌టీ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

●సంగం: స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటుచేసి డెంగ్యూ నివారణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●సీతారామపురం : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా దోమల నిర్మూలన, డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిసిలు శేఖర్‌రాజు, తిరుపాల్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు మజీద్ , ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు

● శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి



అనంతసాగరం మే 16 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై పరికరాలు అందిస్తోందని మండల వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అవసరమైన రైతులకు ఇటీవల పనిముట్లు అందించామన్నారు.

? మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారా.

!భూసార పరీక్షల్లో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామంలో మట్టి నమూనాలు సేకరించాం.

? భూసారాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

! నేల ఉత్పాదకతను పెంపొందిండానికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అన్ని రైతు సేవాకేంద్రాల్లో అందచేసింది.

? తెగుళ్ల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి

! ఒకే రకమైన పంటలు ఖరీఫ్, రబీలో సాగు చేయడం ద్వారా దిగుబడులు తగ్గడమే కాకుండా తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. పంట మార్పిడితో లాభాలు పొందవచ్చు. తెగుళ్లను నివారించవచ్చు.

?సబ్సిడీపై పరికరాలు ఇస్తున్నారా

! వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ఇటీవల ప్రభుత్వం సరఫరా చేసిన వ్యవసాయ పరికరాలు అర్హులైన రైతులకు సబ్సిడీ ద్వారా ఇవ్వడం జరిగింది. మరింత సమాచారం కోసం రైతు సేవాకేంద్రాలో సంప్రదించాలి.

న్యూస్ బాక్స్

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సునీత

ఉదయగిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో సునీత సూచించారు. శుక్రవారం స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలసట, బలహీనత తదితర లక్షణాలు రక్తహీనతను సూచిస్తాయన్నారు. కిశోర బాలికలు ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. శారీరకంగా వచ్చే మార్పులకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షాను, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 540 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 423 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 117 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 200 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

సోమశిలలో 47.187 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 47.187 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 5,730, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

చేజర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదురుపల్లి గ్రామంలోని ఎస్టి కాలనీలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన చెంచయ్య, సుబ్రహ్మణ్యం, సుబరత్నమ్మలకు శుక్రవారం స్థానిక తహసీల్దారు బి మురళి 5వేల రూపాయల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పక్కా గృహాలు నిర్మించేలా హౌసింగ్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

అనంతసాగరం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన కాలనీలోని 28 కుటుంబాలకు అంత్యోదయ రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కాలనీలో పార్టీ తరఫున సర్వేచేసి నివేదికను తహసీల్దారు సుభాషిణికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన కార్యవర్గ సభ్యులు వెంకటేష్, బాలేష్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

అనంతసాగరం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరంలోని గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు అభిషేకాలు, పూజలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో హోమాలు, పుట్టబంగారం తీసుకెళ్లడం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పగడాల మాలకొండయ్య, మాల్యాద్రి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అలాగే ముల్లంగి కనకమ్మ జ్ఞాపకార్థం కుటుంబీకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉన్న వలసవాసులు సైతం గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

సంగం, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై ఉడ్‌హౌస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అనంతసాగరం సెక్షన్ అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ శ్రీనివాసులు మోటారు బైక్‌పై నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తుండగా మార్గ మధ్యంలో సంగం సమీపంలో ఉడ్ హౌస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద మోటారు బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడ్ని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



ప్రతిభా పురస్కార విద్యార్థులతో యూటీఎఫ్ నాయకులు, అధికారులు

సంగం, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సురక్ష హాస్పిటల్ నిర్వాహకుల సౌజన్యంతో శుక్రవారం నగదు పురస్కారాలతోపాటు మెమెంటోలు అందచేసి అభినందించారు. మండలంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 5వేలు, మూడు, రెండు వేల రూపాయల చొప్పున అందచేసి మెమెంటోలతో సత్కరించారు. అదేవిధంగా మండలంలోని ప్రతి పాఠశాలలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ. 2 వేలు, వెయ్యి రూపాలయా చొప్పున నగదు బహుకరించి మెమెంటోలు, సర్టిఫికేట్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో జానకిరామ్, ఎంపీడీవో షాలెట్, ఎంఈవో మల్లయ్య, యూటీఎఫ్ నాయకులు మోహన్, ప్రసాద్, వేణు, నవకోటేశ్వరరావు, వివి శేషులు, చలపతిశర్మ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంగ్లా సెంటర్ సమీపంలో అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పనులపై వచ్చిన వారికి స్థానిక పేదల ఆకలి తీర్చేందుకు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పేరు మీద అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో సుమారు రూ.61లక్షలతో క్యాంటీన్ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రెండు సంవత్సరాల నిరంతరాయంగా పట్టణంలోని అన్న క్యాంటీన్ సొంత నిధులతో నడిపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి : డీఎల్‌పీవో



కుల్లూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆత్మకూరు డీఎల్‌పీవో తదితరులు.

కలువాయి, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్నులు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని ఆత్మకూరు డివిజినల్ పంచాయతీ అధికారి షేక్ నయీంహసన్ తాజ్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వారం రోజుల్లోపు 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆయన ఆదేశించారు. మండలంలో ఎంపిక చేసిన కలువాయి, దాచూరు, చింతలాత్మకూరు, చీపినాపి, పర్లకొండ, బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీల్లో ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా హరితరాయబారులు ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. మండలంలోని 18 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శుల నుంచి ఇన్‌చార్జ్‌లు రికార్డులు స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. కుల్లూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చెత్త సేకరణ ఎలా జరుగుతుందని ఇళ్లకు వెళ్లి పలువురి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రమేష్, కలువాయి పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ కేంద్రంగా కొండమీద కొండూరు

ఏఎస్ పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమీద కొండూరు గ్రామ చెరువును చిత్తడి నేలల సంరక్షణ, అభివృద్ధి కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని ఆత్మకూరు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ పిచ్చిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు, అభిప్రాయాలు సేకరించారు. దీంతో గ్రామం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు పెంచలయ్య, దొరసానమ్మ, ఉప సర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి ఎం మహబూబ్ బాషా, నాయకులు కోకంటి సుధాకర్, యల్లారెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కలువాయి, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చలివేంద్రాన్ని శుక్రవారం అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో శివకుమార్, డిప్యూటీ ఎంపీడీవో రమేష్, సీనియర్ సహాయకులు మల్లిశెట్టి రమేష్, మండల రిసోర్సు కోర్డినేటర్ పి సునీల్, జీ వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కలువాయి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు.

C.R.I.M.E N.E.W.S

స్నేహితుడే హంతకుడు!

- ఆర్థిక లావాదేవీలతోనే రియల్టర్ హత్య
- పోలీసులకు 'దృశ్యం' సినిమా చూపించిన నిందితుడు
- చివరికి చాకచక్యంగా వివరాలు వెలుగులోకి..

నెల్లూరు(క్రైం), మే 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటరెడ్డి నగర్‌లో జరిగిన లియల్టర్ హత్య కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నిందితుడి వివరాలను ఎస్పీ జి కృష్ణకాంత్ ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా అలియాస్ ఇస్సాక్ వెంకటరెడ్డినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, అక్కడే ఓ కార్యాలయాన్ని నడుపుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి కమీషన్ తీసుకుంటూ, రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ రాత్రి చిన్నయ్య తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. మృతుడి తమ్ముడు రాజ ఫిర్యాదు మేరకు వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

● ఆర్థికంగా నష్టపరిచాడని కక్ష పెంచుకొని

ఈ కేసును ఛేదించేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య సూచనలతో నగర డీఎస్పీ సింధుప్రియ పర్యవేక్షణలో వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్యతోపాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ముమ్మరం చేశారు. మర్రిపాడు మండలం తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన సరస్వతి వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఉదయగిరిలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వ టీచరు అయిన వెంకటేశ్వర్లు, మృతుడు చిన్నయ్య ఒకే ప్రాంతానికి చెందినవారు కావడంతో పరిచయం ఉంది. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లుతో మృతుడు చిన్నయ్య నమ్మకంగా ఉంటూ అతని వద్ద రూ.లక్షల నగదు తీసుకొని భాగస్వామ్య ఫైనాన్సు ప్రారంభించాడు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి ఏం అడిగినా చిన్నయ్య వ్యంగ్యమైన సమాధానం ఇస్తుండేవారు. అలాగే తనను నష్టపరచడంతోపాటు ఎంతో మంది ఉద్యోగులను మోసగించి వారి సొమ్మును కాజేసి ఫైనాన్సు వ్యాపారానికి మృతుడు మళ్లిస్తున్నాడని వెంకటేశ్వర్లు కక్ష పెంచుకున్నాడు.

● పథకం ప్రకారమే..

ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం నుంచి వెంకటరెడ్డినగర్‌లోని చిన్నయ్య ఇంట్లోనే వెంకటేశ్వర్లు నమ్మకంగా ఉన్నాడు. రాత్రి అదే ఇంట్లో బెడ్‌రూంలో నిద్రించాడు. అర్ధరాత్రి దాటాక హాలులోని సోఫాలో చిన్నయ్య నిద్రిస్తుండగా వెంకటేశ్వర్లు డంబెల్ తీసుకొని చిన్నయ్య ముఖ్యంపై కొట్టి, అక్కడే ఉన్న సోఫా దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. చిన్నయ్య మృతి చెందాడని నిర్ధారించుకున్న తర్వాత సోఫాపై కారం చల్లి, ఏమీ తెలియని వాడిలా బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు. మరుసటిరోజు ఉదయం చుట్టుపక్కల వారికి, కుటుంబ సభ్యులకు చిన్నయ్యను ఎవరో హత్య చేశాంటూ కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేశాడు. చివరకు వెంకటేశ్వర్లు హత్య చేశాడని పోలీసులకు రుజువైన తర్వాత శుక్రవారం నెల్లూరు రూరల్ పడారుపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, రౌడీయిజం చేసే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసును ఛేదించిన వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్ ఎం రోశయ్య, అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందించారు.

● 'దృశ్యం' చూపెట్టాడు!


హత్య జరిగిన రాత్రి ఇంట్లో మృతుడితోపాటు నిందితుడు వెంకటేశ్వర్లు ఉన్నాడు. హత్య జరిగిన విషయం 6వ తేదీ తెల్లవారుజామున కింద ఫ్లోర్‌లో ఉన్న వారికి, మృతుడు కుటుంబసభ్యులకు నిందితుడు తెలియజేశాడు. అప్పుడే వారు హత్య జరిగినప్పుడు మీకు అరుపులు వినిపించలేదా అని ప్రశ్నిస్తే 'నాకు మెలకువ లేదు.. బెడ్‌రూమ్‌లో ఘాఢ నిద్రలో ఉన్నాను .' అని చెప్పాడు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటేశ్వర్లును విచారణలో ఎన్నిసార్లు ప్రశ్నించినా అవే సమాధానాలు ఇచ్చాడు. దృశ్యం సినిమాలో హీరో వెంకటేష్ నటించినట్లు సీరియస్ నటిస్తూ వచ్చాడు. చివరికి ఎస్పీ నేరుగా ప్రశ్నించినా అవే సమాధానాలు ఇచ్చాడు. దీంతో పోలీసులు పలు కోణాల్లో విచారించి, వెంకటేశ్వర్లే నిందితుడిగా పోలీసులు నిర్ధారించుకొని అరెస్ట్ చేశారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత



సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవపాళెంలోని చేపల గుంటలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరు నుంచి లారీలో సుమారు 70 డమ్ముల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనంతరం మత్స్యశాఖ అధికారి పొట్టెయ్య, వీఆర్వో మోహన్ సమక్షంలో పోలీసులు చికెన్ వ్యర్థాలను సంగం కొండ వద్ద గుంత తీసి పూడ్చిపెట్టారు. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మురళి అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



జాతీయ రహదారి సమీపాన చెట్ల వద్ద పడి ఉన్న వెంగయ్య మృతదేహం

సీతారామపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన స్థానిక ఆరులైన్ల జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుండుపల్లి గ్రామానికి చెందిన నల్లమేకల వెంగయ్య (63) రెండురోజుల క్రితం కట్టెల కోసం అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో దారితప్పి జాతీయ రహదారిపై వస్తూ మృతి చెందాడన్నారు. తల, శరీరంపై గాయాలు ఉండడంతో వెంగయ్య మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్‌ఐపై కేసు నమోదు

కావలి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): కొండాపురం ఎస్‌ఐ వెంకట్రావుపై కావలి 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. 1వ పట్టణ ఎస్‌ఐ సుమన్ కథనం మేరకు.. వెంకట్రావు కావలిలో ఎస్‌ఐగా పనిచేసిన సమయంలో పట్టణంలోని వివేకానంద పార్కు ప్రాంతానికి చెందిన ఓ వివాహితతో సన్నిహితంగా ఉండి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆ మహిళ ఈనెల 11వ తేదీన 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఎస్‌ఐ వెంకట్రావెను కొండాపురం నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు. ఆ మహిళ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 525



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

దగదర్తి(బిట్రగుంట), మే 16(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందచేశారు. ఎంఈవో బాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీయుఎస్ సహాధ్యక్షుడు చక్రపాణి 36 మంది విద్యార్థులకు మెమోంటోలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, ఉన్నత పాఠశాల హెచ్ ఎం ప్రకాశంబాబు, జవహర్‌బాబు, ఏపీయుఎస్ మండల అధ్యక్షుడు మాల్యాద్రి, నేతలు శ్రీనివాసులు, రాజమ్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాడు నిలిపివేత...
నేడు పునరుద్ధరణ!

- ▶▶ రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు
- ▶▶ గత వైసీపీ ప్రభుత్వంలో పథకం అమలుకు మంగళం
- ▶▶ కూటమి ప్రభుత్వంలో అందజేస్తుండటంతో అన్నదాతల హర్షం



పరికరాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్(ఫైల్)

జలదంకి, మే 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత అంటూ ఊదరగొట్టిన గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై అందజేసే యాంత్రీకరణ పథకానికి నాడు మంగళం పాడింది. గడిచిన ఐదేళ్లల్లో ఏ ఒక్క రైతుకు కూడా వీటిని అందజేయలేదు. దీంతో ఆపార్టీకి సానుభూతి పరులైన రైతులతోపాటు నాయకులు సైతం వైసీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వ్యవసాయంపై ఆధార పడిన రైతులు గత ఐదేళ్ల వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం ఎదురుచూసి అలసిపోయారు. వ్యక్తిగతంగా రాయితీ యాంత్రీకరణ పరికరాలు అందివ్వకుండా గ్రామస్థాయిలో క్లస్టర్ల సంఘాలకు పరికరాలు అందించారు. అవి ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడంతో రైతులకు ఈ యంత్ర పరికరాలు ఏమాత్రం ఉపయోగపడలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న యాంత్రీకరణ పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం కొత్తగా క్లస్టర్ సంఘాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో పలుకుబడి ఉన్న పెద్ద రైతులకు సంఘాల పేరుతో రాయితీ పరికరాలు అందించింది. ఈ క్రమంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యక్తిగత యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరించింది. అవసరమైన రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు పంపిణీ చేస్తోంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తోన్నారు. ఈ పథకం కింద స్థానిక రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కె)ల్లో చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులు వీఏఏలను సంప్రదించి దరఖాస్తు చేసుకుని ఎంపిక చేసిన పరికరం కోసం రాయితీ పోను మిగిలిన నగదు డీడీ రూపంలో చెల్లించిన వెంటనే రైతులు నచ్చిన కంపెనీ పరికరం అందజేస్తున్నారు. ఇలా ఇప్పటికే మండలంలో 50 నుంచి 70 వరకు వ్యక్తిగత యాంత్రీకరణ పరికరాలు అందజేశారు. కొత్తగా ఖరీఫ్ సీజన్‌లో కూడా వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ సంసిద్ధంగా ఉంది.

● సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం రాయితీ

ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు 50శాతం రాయితీ ఇస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు అదనపు రాయితీ ఉంది. వ్యవసాయానికి సంబంధించిన ట్రాక్టర్ పనిముట్లు, ట్రాక్టర్ స్ప్రేయర్లు, విత్తన గొర్రులు, తైవాన్‌స్ప్రేయర్లు లాంటివి అనేకం రాయితీ కింద అందిస్తోంది.

● ఈ పంట నమోదు తప్పనిసరి

యాంత్రీకరణ పరికరాలు పొందాలంటే రైతులు తమ సాగు వివరాలు ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి. దీంతో పాటు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌పోర్టుసైజు ఫొటో తీసుకుని స్థానిక రైతు సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

● రైతుల్లో ఆనందం

గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన వ్యక్తిగత వ్యవసాయ యాంత్రీకరణ రాయితీ పథకం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే తిరిగి కొనసాగించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం వైసీపీ ప్రభుత్వం నిలిపివేసినప్పుడు ఆ పార్టీ సానుభూతిపరులైన రైతులే ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ అప్పటి ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలతో వారిలో చలనం రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే పథకం తిరిగి కొనసాగించడంతో రైతులు ముక్తకంఠంతో ఆనందం వ్యక్తం చేయగా కూటమి పార్టీల నాయకులు మాది రైతుకు మేలు చేసే ప్రభుత్వమని, వైసీపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం అని ఆరోపిస్తున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు

● కిషోర్‌బాబు, ఎస్ఐ, అల్లూరు

అల్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే సహించేదిలేదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించం. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లలో పౌరులకు సత్వర సేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో కలిసి జీవించాలని, నేరప్రక్రియకు పాల్పడి ఇబ్బందులు పడవద్దని ఏస్ఐ కిషోర్‌బాబు పేర్కొన్నారు.



? దొంగతనాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. దీంతో గత ఆరు నెలలుగా దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. ఇకపై కూడా నిఘా ఉంచుతాం.

? పేకాట, కోడి పందేలను అరికడతారా.

! మండలంలోని ఇప్పటికే పలు ప్రాంతాల్లో పేకాట, కోడి పందేల స్థావరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేశాం. నిర్వాహకులకు హెచ్చరించాం. నిబంధనలు, చట్టాన్ని అతిక్రమిస్తే ఉక్కుపాదం మోపుతాం.

? మండలంలో నేరాల సంఖ్య ఏవిధంగా ఉంది.

! గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాలు తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా రాత్రుళ్ల గస్తీలు, తిరునాళ్లలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం.

? స్టేషన్‌లో సిబ్బందికి, పౌరులకు మధ్య ఎలాంటి సంబంధం ఉంది.

! వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ స్నేహ పూర్వకంగా పలుకరిస్తాం. వారికి అవసరమైన వసతులు కల్పిస్తున్నాం. గౌరవ ప్రదంగా నడుచుకొని వారికి సేవలు అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

విత్తనాభివృద్ధి క్షేత్రం భూముల పరిశీలన

లింగసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినపవని విత్తనాభివృద్ధి క్షేత్రంకు చెందిన భూములలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన నిమిత్తం కేటాయించి భూములను కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ శుక్రవారం పరిశీలించారు. 2019లో ప్రభుత్వం విత్తనాభివృద్ధి క్షేత్రంకు చెందిన 540 ఎకరాలలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రానికి 410 ఎకరాలను ఇచ్చారు. వాటిలో ఏ పంటలు సాగు చేస్తున్నారని అక్కడి అధికారులను ప్రశ్నించారు. ఈ భూముల అభివృద్ధి, గోడౌన్ల నిర్మాణం తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ భూములలో వరి, మినుము, నువ్వు, జొన్న పంటలు సాగు చేస్తారని ఏఈవో అంకమ్మరావు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె శ్రీనివాసులు, మండల సర్వేయరు గోపిరెడ్డి, వీఆర్ఓలు కిషోర్, మస్తాన్‌వలి, సర్వేయరు మన్విత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రారంభం

లింగసముద్రం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంటలో శుక్రవారం భూముల రీసర్వే ప్రారంభించారు. గ్రామంలోని రైతులు తమ భూములను రీసర్వే చేయించుకొనేందుకు అధికారులకు సహకరించాలని ఆ గ్రామ వీఆర్‌వో వినోద్ కోరారు. భూముల రీసర్వే వలన ఎలాంటి తప్పులు ఉండవని, దీనివలన రైతుల మధ్య ఎలాంటి వివాదాలు తలెత్తవని చెప్పారు. గ్రామంలో మొత్తం 135 సర్వే నెంబర్లలో 1590 ఎకరాలను రీసర్వే చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు మల్లికార్జున, కిషోర్, బ్రహ్మయ్య సర్వేయర్లు ఎన్ సుప్రజ, బాలాజీ, వెంకటేష్, కార్తీక్, శివప్రసాద్, గణేష్, వినోద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్‌కే 'కిశోరి వికాశం'

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి) : యుక్త వయస్సులో ఉన్న బాలికల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాశం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాశంపై బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ బాల్యం నుంచి యుక్త వయస్సు వరకూ ఎవరి నుంచి మోసపోకుండా బాలికలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, ఆశా కార్యకర్త వరలక్ష్మీ, హెల్పర్ ప్రసన్న, బాలికలు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

వలేటివారిపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి) : పొగాకు, మిర్చి, మినుము పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైసీపీ మండల ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి శివరామిరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది పంటల సాగుకు ఖర్చులు పెరిగాయని, దీనికి తోడు అధిక వర్షాలు, తెగుళ్ల వలన దిగుబడులు తగ్గినట్లు తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఏడాది పొగాకు క్వింటం రూ.35 వేల, మిర్చి క్వింటం రూ.22 వేల పలికిందని తెలిపారు. ఈ ఏడాది పొగాకు క్వింటం రూ.24 వేల, మిర్చి రూ.12 వేలకు పడిపోయిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి పొగాకు, మిర్చి, మినుము రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఆదరణ కేంద్రానికి మతిస్థిమితం లేని వ్యక్తి

బిట్రగుంట, మే 16(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ ప్రాంతంలో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ నిర్వాహకుడు కే.సింహాద్రిరావు శుక్రవారం ఆదరణకేంద్రానికి తరలించారు. ఆయన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం, అప్పలరావుపేట చెందిన వాడని, పేరు షేక్.ఇమామ్ సాహెబ్ అని భార్య పేరు అబ్జల్‌బీ అని చిప్పినట్లు సింహాద్రిరావు తెలిపారు.

దగ్ధమైన పూరింటిని పరిశీలించిన అధికారులు

కలిగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరకొండూరులో గురువారం పోలేరమ్మ పొంగళ్ల సందర్భంగా బాణాసంచా పడి దగ్ధమైన పూరింటిని శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. భక్తులు అమ్మవారి ఆలయానికి వెళ్లే క్రమంలో ఓ బాణాసంచా చువ్వ నోటి సుబ్బారెడ్డికి చెందిన పూరింటిపై పడింది. గ్రామస్థులు గమనించే లోపున మంటలు చెలరేగి దగ్ధమైంది. ఆ ఇంట్లో గత కొంతకాలంగా ఎవరూనివాసం లేకపోయేసరికి పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. పరిశీలించిన రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. 7 బస్తాలు ధాన్యం, 4 బస్తాలు మిర్చి ఆ ఇంట్లో నిల్వ చేసి ఉంచగా దగ్ధమయ్యాయని ఇంటి యజమాని అధికారులకు వివరించారు.

ముర్రా జాతి లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనకు తీసుకొచ్చిన ముర్రాజాతి లేగదూడలు

కొండాపురం, మే 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుజంగాలపల్లెలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆరు నెలల లోపు ముర్రా జాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో గ్రామంలోని 46 లేగదూడలను వాటి యజమానులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగదూడలను సంరక్షించుకొని మేలుజాతి పాడిపశువులుగా అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రాంతీయ పశువైద్యశాల కలిగిరి, సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ దూడలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించి 7 నుంచి 10 రోజులలోపల నట్టల నివారణ మందులు వాడుకోవాలన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న లేగదూడలలో ప్రథమ స్థానం లో ఎం.వెంకటరమణయ్య దూడను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. పాల్గొన్న రైతులకు కాల్షియం టానిక్, మినరల్ మిక్చర్ బ్లాక్, నట్టల నివారణ మందులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు రాజశేఖర్, శిద్ధనకొండూరు పశువైద్యాధికారి డాక్టర్ వీరహరన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య

కావలిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి) : బలవంతపు భూసేకరణ ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం వెంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కావలి మండలం ఆనెమడుగు తదితర గ్రామాల్లో బీపీసీఎల్ కంపెనీకి కట్టబెట్టేందుకు 800 ఎకరాలకుపైగా బలవంతపు భూసేకరణ చేయబోతున్నారన్నారు. ఆయా గ్రామాల రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, గీత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తుల వారు, రైతుల బతుకుదెరువు బుగ్గిపాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం బీపీసీఎల్ కొరకు చేయనున్న భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహించి ఉన్నతాధికారులకు విన్నవించామని, అయినప్పటికీ ప్రభుత్వం భూసేకరణకు పట్టుబట్టడం దుర్మార్గమన్నారు. పచ్చని పల్లెటూర్లలో పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ, ఉపాధి భద్రత బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందన్నారు. కావలి కాలువ కింద 74 వేల ఎకరాలకు నీరు ఇస్తామని ఇప్పటి వరకు కాలువ చివరి వరకు నీరు ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, సీఐటీయు గౌరవాధ్యక్షుడు పెంచలయ్య పాల్గొన్నారు.

కందుకూరు ప్రాంతంలో భారీవర్షం

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కందుకూరు ప్రాంతంలో శుక్రవారం ఉదయం భారీవర్షం కురిసింది. ఉదయం ఆరుగంటల నుంచి ఏడున్నర వరకు అనేకప్రాంతాల్లో కుండపోత వర్షం కురవగా కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఉరుములు మెరుపులతో వాతావరణంలో బీభత్సం నెలకొంది. ఉరుములు మెరుపుల ధాటిని బట్టి అనేకచోట్ల పిడుగులు పడడంతో అనేకచోట్ల విద్యుల్ లైన్ల కండెన్సర్లు కాలిపోవటంతో మధ్యాహ్నం వరకు అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం జరిగింది. పోకూరు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి నలదలపూరు, గుడ్లూరు, దారకానిపాడు సబ్ స్టేషన్లకు వెళ్లే ప్రధానలైనుకు నష్టం జరగటంతో ఆ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగింది. పోకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అనేక గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోగా ఏఈ మధుబాబు తమ సిబ్బందితో మరమ్మతులు పూర్తి చేయించి సరఫరాను పునరుద్ధరించారు. కందుకూరు మండలంలో 4 సెం.మీటర్లు, ఉలవపాడు 2 సెం.మీటర్లు, గుడ్లూరు 1.8 సెం.మీటర్లు, వలేటివారిపాలెంలో 1.5 సెం.మీటర్ల వర్షపాతం నమోదవగా లింగసముద్రం మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం ప్రభావంతో ఉలవపాడు, గుడ్లూరు, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో ఉన్న మామిడితోటలకు, రాళ్లపాడు ఆయకట్టులో సాగులో ఉన్న పత్తికి మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కందుకూరు ప్రాంతంలో వేలాది ఎకరాలలో సాగులో ఉన్న జామాయిల్, సరుగుడు తోటలకు ఎంతో మేలని భావిస్తున్నారు. అలాగే వేసవిపైర్లుగా సాగుచేసే నువ్వు, పెసర తదితర పైర్లు సాగుకు ఈ వర్షంతో ఎంతో అదను అనుకూలించినట్లని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీవర్షం కురిసినా గాలి పెద్దగా లేకపోవటంతో మామిడితోటలకు కూడా నష్టం వాటిల్లలేదు.

చల్లబడ్డ వాతావారణం

లింగసముద్రం : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా శుక్రవారం మండలంలో చిరుజల్లులు కురిశాయి. దీంతో గ్రామాల్లో వాతావరణం చల్లబడింది. తెల్లవారుజామున 4 గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. ఉదయం 9 గంటల వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. రోజుల నుంచి మండే ఎండలు, వేడి గాలులతో ఇబ్బందులుపడ్డ ప్రజలు ఈ వాతావరణంతో ఉపశమనం పొందారు.

డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంకకుండా చర్యలు



డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ తదితరులు

కావలి, మే 16(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంకకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 26వ వార్డులో రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న డ్రైనేజీలో నీరు సక్రమంగా పారకుండా భూమిలోకి ఇంకి పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్‌లలో మురుగు నీరు వస్తోందని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి డ్రైనేజీని పరిశీలించి నీటి పారుదలకు ఆటంకంగా ఉన్న చెత్తా చెదారాన్ని తొలగింపచేశారు. అనంతరం డ్రైనేజీ నీరు భూమిలోకి ఇంక కుండి కాలువలో బెడ్ కాంక్రీట్ వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సాయిరాం, ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గంగినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ పలుకూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవటం ద్వారా నష్టాల నుంచి రైతులు తప్పించుకోవచ్చని మండల ప్రకృతి వ్యవసాయ అధికారి ధనమ్మ తెలిపారు. మండలంలోని పలుకూరులో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించటం వల్ల చేకూరే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శుక్రవారం కురిసిన భారీవర్షం వల్ల భూములు పదునైనందున పీఎండీఎస్ విధానంలో 25 రకాల విత్తనాలను భూమిలో చల్లుకుని 40రోజుల తర్వాత కలియదున్నితే భూసారం ఎంతో పెరుగుతుందని, తద్వారా ఖరీఫ్, రబీలలో సాగుచేసే పంటలలో అధికదిగుబడులు సాధించటంతో పాటు చీడపీడల నుంచి కూడా రక్షణ పొందవచ్చని తెలిపారు. రబీలో సాగుచేసే శనగలో గతకొంత కాలంగా రైతులను ఎండుతెగులు ఇబ్బందిపెడుతున్నందున ఎండుతెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే పొగాకులో మల్లె నివారణకు పాటించాల్సిన పద్ధతులు, చీడపీడల నిర్మూలనకు ఉపయోగించే కషాయాల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద నార్నె రోశయ్య, డీఎంఎంటీ మాధవరావు, మహిళారైతులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కాకర్లపాలెం రోడ్డు అధ్వానం

వలేటివారిపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి): తారురోడ్డు చూశాం, మట్టిరోడ్డు చూశాం, సిమెంట్‌రోడ్డు చూశాం ఇప్పుడు కంకరరాళ్ల రోడ్డు చూస్తున్నాం. మండలంలోని వలేటివారిపాలెం జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెంలోకి వెళ్లే సుమారు రెండు కిలో మీటర్లు రోడ్డంతా కంకరరాళ్లే, బంతుల సైజులో ఉన్న కంకరరాళ్ల రోడ్డుపై నడుస్తూ వాహనదారులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. మెటల్‌రోడ్డుపై ఉన్న మట్టి వర్షానికి కొట్టుకపోవడంతో కంకరరాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు తమ వాహనాల టైర్లకింద కంకరరాళ్లు పడి టైర్లు స్లిప్ అయి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు రాకపోకల సమయాలలో టైర్ల కింద కంకరరాళ్లు పడి రోడ్డుపై వెళ్లే పాదచారులకు తగిలి రక్తగాయాలవుతున్నాయి. అయినా పట్టించుకునే నాథుడే లేరు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ఆ రెండు కిలోమీటర్లు తారు రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



కొత్తపేట వద్ద రోడ్డుపై పూడ్చిన గుంతలు

కలిగిరి, మే 16(ఆంధ్రజ్యోతి): కలిగిరి మండలం గుంపర్లపాడు కొత్తపేట, జమ్మవరం గ్రామాల మీదుగా, ఏఎస్‌పేట మండలంకు వెళ్లే లింకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణానికి నరకంగా మారింది. ఈ మార్గం ద్వారా విజయవాడ, కావలి, కందుకూరు తదితర ప్రాంతాల నుంచి ఏఎస్‌పేట, ఆత్మకూరు ప్రాంతాలకు నిత్యం ప్రయాణాలు చేసేవారు ఈ గుంతలవద్ద ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఈ క్రమంలో పలుమార్లు ఈ మార్గంలో ప్రయాణికుల ఇబ్బందులపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో స్పందించిన అధికారులు గత వారం రోజులుగా రోడ్డుకు తాత్కాలికంగా ప్యాచ్ వర్క్‌లు చేపట్టారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జమ్మవరం, కొత్తపేట ప్రాంతాల వద్ద ప్యాచ్‌వర్క్‌లు దాదాపు పూర్తయ్యాయి. గుంపర్లపాడు వద్ద కొంతమేర గుంతలమయంగా ఉన్న రోడ్డుకు ప్యాచ్ వర్క్‌లు వేయడం పూర్తయితే కలిగిరి, ఏఎస్‌పేట మండలాల ప్రజలు ఈ మార్గంలో తమ ప్రయాణం సాఫీగా జరుగుతుందని పేర్కొంటున్నారు.

చెరువు కలుజు వాగు ఆక్రమణ

● ఆందోళనలో రైతులు ● చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు



ఇరువైపులా ఆక్రమణలతో పిల్ల కాలువలా మారిన కలుజు వాగు

కావలి రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): కావలి మండలం చలంచర్లలో చెరువు కలుజు ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయి. గ్రామానికి వెళ్లే దారిలోని చెరువు కలుజు దగ్గర నుంచి గుండాలమ్మవాగు వరకు ఆక్రమణలకు గురవుతున్నా అటు పాలకులు ఇటు అధికారుల పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామానికి వెళ్లే దారి పక్కన కలుజు వాగుకు ఒక పక్క వైసీపీ సానుభూతి పరులు వాగును పూడ్చి మామిడి, టెంకాయచెట్లు నాటితే మరోపక్క టీడీపీ సానుభూతి పరులు ఇటీవల వాగును కొంత మేర పూడ్చి మట్టి తోలారు. కలుజు దగ్గర నుంచి గుండాలమ్మ వాగు వరకు కలుజు వాగుకు ఇరువైపుల వ్యవసాయ భూములు కావడంతో ఆక్రమణలతో వాగు కుచించుకుపోయి చిన్న పంట కాలువలా మారింది. దీంతో అధిక వర్షాలు కురిసినప్పుడు చలంచర్ల చెరువు నిండి వర్షపు నీరు మొత్తం కలుజు వాగుకు పడటంతో చలంచర్ల ఎస్సీకాలనీలోని వర్షపు నీరు నిల్వ చేరుతుంది. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మాలకొండకు భక్తుల పాదయాత్ర



ఇరుముడి కట్టించుకుంటున్న నృసింహుడి మాలధారులు

వలేటివారిపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుండి, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, కాకర్లపాలెం, పోలినేని చెరువు, ఉప్పలపాడు, పోలినేనిపాలెం, బంగారక్కపాలెం తదితర గ్రామాల్లోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి మాలలు ధరించిన భక్తులు శుక్రవారం ఇరుముడి కట్టుకొని మాలకొండకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఆయా గ్రామాల్లో సుమారు 5 వందల మంది భక్తులు మాలలు ధరించి 41 రోజులు ఎంతో నిష్టతతో నృసింహుడికి పూజలు చేశారు. శనివారం నరసింహస్వామి జయంతోత్సవాల సందర్భంగా కాలినడకన మాలకొండకు వెళ్లి స్వామివారికి ఇరుముడి సమర్పించి మొక్కులు చెల్లించనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దాతలు సాయంతో మాలాధారులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

6.46 లక్షల మందికి పనిలేదు



● నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు ● పూర్తయిన వర్క్‌ఫ్రం సర్వే

ఇళ్ల వద్దనే ఉంటూ పనిచేసే విధానం తీసుకువస్తామని సీఎం చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో వెల్లడించారు. ఇంటి పని విధానాన్ని విస్తృత పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. వివిధ సంస్థల ద్వారా ప్రస్తుతం ఇళ్ల నుంచి పనిచేస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించాలని నిర్ణయించింది. ఏ పని లేనివారిని గుర్తించి వారికి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో ఆ మేరకు 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారి వివరాల సేకరణకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేపట్టిన వర్క్‌ఫ్రం హోం సర్వే దాదాపు పూర్తయింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 5,25,506 కుటుంబాలను వర్క్ ఫ్రం హోం సర్వేలోకి తీసుకున్నారు. అందులో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు 11,30,127 మంది ఉండగా.. ఇప్పటి వరకు 11,28,269 మంది వివరాలను నమోదు చేశారు. సర్వేలో ఆసక్తిగల వివరాలు వెలుగు చూశాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వయసు వారిలో ఎటువంటి పనిలేకుండా 6,46,236 మంది ఖాళీగా ఉన్నట్లు తేల్చారు.

ఇదీ లెక్క

- కుటుంబాలు: 5,25,506
- జనాభా: 11,30,127 మంది
- సర్వే పూర్తయిన వారు: 11,28,269
- పని చేసేవారు: 2,35,499
- పనిలేని వారు: 6,46,236
- ఇంటి నుంచే పని ఆశించేవారు: 2.52 లక్షల మంది

వర్క్ ఫ్రం హోంకు ఆసక్తి

వర్క్ ఫ్రం హోంకు 2,52,599 మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే 36,927 మంది ఏదో ఒక రంగంలో పనిచేస్తున్నారు. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులోభాగంగా మొదటి విడత బీటెక్ పూర్తిచేసిన వారికి పనిచూపించేందుకు సామర్థ్య పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. ఏ ఉపాధి లేని వారిని గుర్తించి వారందరికి ఆసక్తి గల రంగంలో శిక్షణ ఇప్పించి నైపుణ్యం పెంచేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇక తగిన విద్యార్హతలు ఉన్నవారు ఇళ్ల నుంచే పని చేసుకునేలా (వర్క్ ఫ్రం హోం) వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. జిల్లాలో ఏ పనిలేనివారు 6,46,236మంది ఉన్నట్లు తేల్చారు. ఇక, ఇంటర్నెట్ సదుపాయం ఉన్నవారిని పరిశీలిస్తే బ్రాడ్‌బ్రాండ్ 16,339మంది ఇళ్లలో ఉంది. వైఫై 11,494 మంది ఇళ్లలో ఉంది. వర్క్‌ఫ్రం హోం ఆసక్తి ఉన్న వారికి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.



తిరుపతిలో వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్ ఫొటో)

ఎంత మంది.. ఏం చదివారంటే..

జిల్లాలో 1 నుంచి 9వ తరగతి వరకు చదివిన వారి సంఖ్య 26,252. 36,814 మంది పదో తరగతి చదివారు. ఇక, ఇంటర్ 41,323 మంది, డిప్లొమా 13,534 మంది, డిగ్రీ 60,920 మంది, ఇంజనీరింగ్ 32,705 మంది, ఎంబీబీఎస్ 541, లా (బీఎల్) 394, పీజీ 22,466 మంది, పీహెచ్‌డీ 583 మంది పూర్తి చేశారు. ఇతరులు 8,409 మంది ఖాళీగా ఉన్నారు. నిరక్షరాస్యులు 8,658 మంది ఉన్నారు.



తిరంగా ర్యాలీ

'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్న భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ సిటిజన్స్ ఫర్ నేషన్ సెక్యూరిటీ పేరిట బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో శుక్రవారం తిరుపతిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు పొడవాటి జాతీయ జెండాను రెపరెపలాడిస్తూ, భారత్ మాతాకి జై అంటూ నినదించారు. ఈ ర్యాలీలో టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు ఎస్కే బాబు, నారాయణ, టీడీపీ నేతలు మహేష్ యాదవ్, ఆముదాల తులసీరాం, బీజీ కృష్ణ యాదవ్, జేడబ్ల్యూ విజయకుమార్, కందాటి సురేష్, మన్నెం శ్రీనివాసులు, బీజేపీ నాయకులు నవీన్‌కుమార్ రెడ్డి, గుండాల గోపీనాథ్, మునిసుబ్రమణ్యం, గాలి పుష్పలత, జల్లి మధుసూదన్, జనసేన నాయకులు దేవర మనోహర్, వనజ, బాలసుబ్రమణ్యం, వర్తక సంఘ ప్రతినిధులు పరదాల మణి, వేదం ప్రభాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

బెయిలొచ్చిందా.. తిరిగొస్తే ఒట్టు!



● తప్పించుకు తిరుగుతున్న 920 మంది గంజాయి బ్యాచ్
● నిందితుల్లో ఇతర రాష్ట్రాల వారే అధికం
● ప్రత్యేక బృందాలతో గాలింపు

బెయిల్‌తో బయటకొచ్చే గంజాయి బ్యాచ్.. మళ్లీ కనిపించడం లేదు. కోర్టు విచారణకు రావడంలేదు. ఇలా ఉమ్మడి జిల్లాలో బెయిల్ పొందిన వారిలో ఇంకా 920 మంది తప్పించుకు తిరుగుతున్నారు. వీరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ నిందితుల్లో అత్యధికులు ఇతర రాష్ట్రాల వారే.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

గత ఐదు సంవత్సరాల్లో గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లారు. కొంత కాలం జైళ్లలో ఉండి.. బెయిల్‌పై బయటకు వస్తున్నారు. ఆ తర్వాత కోర్టు విచారణకు హాజరు కావడంలేదు. దీనిపై విచారిస్తున్న న్యాయమూర్తులు నిందితులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేస్తున్నారు. వారిలో చాలా మంది జాడ కూడా కనిపించడంలేదు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిని విచారించే సమయంలో మరికొందరు బయట వ్యక్తుల ప్రమేయమూ వెలుగు చూస్తోంది. పోలీసులు వారిపైనా కేసులు నమోదు చేస్తున్నారు. అరెస్టు చేయడానికి వెళ్తే పత్తా లేకుండా పోతున్నారు. ప్రధానంగా ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 1020 మంది గంజాయి నిందితులు తప్పించుకుని తిరుగుతుండగా.. ఏడాది కాలంలో దాదాపు 100 మందిని పట్టుకున్నారు. మిగిలిన 920 మంది కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. ఇలా తప్పించుకుని తిరుగుతున్న వారిలో ఇతర రాష్ట్రాల వారు.. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన వాళ్లు అధికంగా ఉన్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. కోర్టు వాయిదాలకు హాజరు పరచాలని సమన్లు జారీ అవుతున్నా నిందితుల ఆచూకీ దొరకడంలేదు. దీంతో కేసుల పురోగతి ముందుకు సాగడంలేదు.

102 మందిపై గంజాయి షీట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 102 మంది స్మగ్లర్లపై గంజాయి షీట్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కూటమి అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపింది. ఉమ్మడి జిల్లా పరిధిలో గత తొమ్మిది నెలల వ్యవధిలో దాదాపు పది వేల కిలోల గంజాయిని పట్టుకున్నారు.ఇందులో 310 మందికి పైగా అరెస్టు అయ్యారని సమాచారం. ఒకటి కంటే ఎక్కువసార్లు పట్టుబడుతున్న వారిపై గంజాయి షీట్లు తెరిచారు. మరో 20 కేసుల్లో నిందితులపై పీడీ యాక్టు నమోదు చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

● తిరుమలలో స్థానిక మహిళలకు భద్రతాధికారుల సూచన



మహిళలతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఎవరైనా అనుమానితంగా కనిపిస్తే తమకు సమాచారమివ్వాలని భద్రతాధికారులు స్థానిక మహిళలను కోరారు. తిరుమలలో శుక్రవారం భద్రతా తనిఖీలు జరిగాయి. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో వన్, టూటౌన్ పోలీసులు, విజిలెన్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్, కంచి, పుష్పగిరి, ఉడిపి, కాశీ, శృంగేరి శంకర మఠాలు, గుబ్బా చౌల్ట్రీ, ఎస్వీ మ్యూజియం, ఆర్బీ సెంటర్, గోల్డెన్ బాలాజీ హోటల్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా తిరుమలలో నివాసముంటున్న స్థానిక మహిళలు, వృద్ధులతో మాట్లాడారు. మహిళలు శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుంటే మీ రక్షణ పోలీసుల చేతుల్లో ఉంటుందని వివరించారు. పలు భవనాల్లో ఫైర్ సేఫ్టీ విధానాలను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ఫిన్స్ ద్వారా విచారించారు.

నేటి పాలకులకు రాజ్యాంగమంటే గౌరవమేదీ?

● ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి(విద్య), మే 16(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగమంటే ఏమాత్రం గౌరవంలేని శక్తులే నేడు దేశాన్ని పాలిస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల ఆహ్వానసంఘం అధ్యక్షుడు కె.నారాయణ విమర్శించారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన రెండోరోజు ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. గవర్నర్ల అధికారాల విషయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి ఖండించిన తీరు చూస్తుంటే రాజ్యాంగానికి ముప్పు పతాకస్థాయికి చేరిందని అర్థమౌతోందన్నారు. ఈ పరిణామాల పట్ల యువత అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం ఇచ్చిన విద్య, వైద్యం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ, అమలుకు అవిశ్రాంతంగా పోరాడుతున్న సంస్థ ఏఐవైఎఫ్ అని చెప్పారు. మతతత్వానికి వ్యతిరేకంగా లౌకికవాదం, ప్రజాస్వామ్యంకోసం పోరాడుతోందన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని విస్మరించడంపై యువ రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని అఖిలభారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఇటీవల 13 నెలలపాటు జరిగిన చారిత్రాత్మక రైతు ఆందోళనలో పెద్దసంఖ్యలో యువ రైతులు పాల్గొనడంవల్లనే ఆందోళన ఉద్యమ రూపందాల్చి కేంద్రప్రభుత్వ మెడలు వంచిందని గుర్తు చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టి తనకు అనుకూల పెట్టుబడిదారులైన అదానీ, అంబానీల లాభంకోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్‌వైఏ అఖిల భారత ఉపాధ్యక్షుడు సుందర్‌రాజన్ విమర్శించారు. సుఖ్‌జిందర్ మహేసరి, వలీ ఉల్లాఖాద్రి, అరుణ్, లెనిన్, ఆర్తి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన రెండోరోజు సభలో ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు జగదీష్‌కుమార్, ఏఐటీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యులు బీవీవీ కొండలరావు,డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం, ఎన్ఎఫ్‌డబ్ల్యు ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధూ, బీఎంకేయూ జాతీయ అధ్యక్షులు పెరియార్‌స్వామి తదితరులు పాల్గొని ప్రసంగించారు. 'ఎన్నికల సంస్కరణలు, రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ, ప్రజాస్వామ్యం'పై హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ప్రసంగించారు.

యువతరమా మేలుకో..

'దేశ్ అచ్చాహై అన్నావ్ మోదీ.. దేశ ప్రజలు సచ్చేలా ఉన్నారంటూ మోదీ పాలనలో కష్ట నష్టాలపై తెలంగాణకు చెందిన విప్లవ గాయకుడు పాట పాడారు. యువతరమా మేలుకో... మగత నిద్ర మానుకో అనే పాట యువతరాన్ని ప్రేరేపించింది. పల్లె నరసింహ, ధర్మేంద్ర తమ పాటలతో హుషారు తెప్పించారు.

రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని..!



తిరుమల ఆలయం ముందు ఇస్రో చైర్మన్, అధికారులు - చెంగాళమ్మ ఆలయంలో..

తిరుమల/సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని షార్ నుంచి ఆదివారం జరిగే రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి ఆలయం, శ్రీకాళహస్తీశ్వరాలయం, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నమూనాకు ప్రత్యేక పూజలు చేయించారు. శాస్త్రవేత్తలతో కలిసి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ఈ మూడు ఆలయాలను సందర్శించారు. సూళ్లూరుపేటలో ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి స్వాగతం పలకగా.. పూజలనంతరం వేదపండితులు ఇస్రో చైర్మన్‌కు ఆశీర్వవచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. నిర్దేశిత సమయానికే ఆదివారం ఉదయం 5.59 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ప్రయోగం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇస్రో చైర్మన్‌తోపాటు షార్ డైరెక్టర్ డాక్టర్ రాజరాజన్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ ఏకే పాత్ర, ఇస్రో డైరెక్టర్ డాక్టర్ శివానందన్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ గుప్తా, అడ్మిన్ ఆఫీసర్ డాక్టర్ అభిషేక్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

గంటలో దర్శనం అని చెప్పి ఉచిత క్యూలో పంపారు

● బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్‌పై భక్తుల ఫిర్యాదు



ట్రావెల్స్ ప్రతినిధులు ఇచ్చిన టికెట్లను చూపుతున్న బెంగుళూరు భక్తబృందం

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్స్ సంస్థ కేవలం గంటలోనే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామని చెప్పి తీసుకువచ్చి చివరకు ఉచిత దర్శనం క్యూలో పంపారని బెంగళూరుకు చెందిన భక్తబృందం ఆవేదన వ్యక్తం చేసింది. వారు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరుకు చెందిన వర్ష ట్రావెల్స్ అనే సంస్థ బెంగళూరుకు నుంచి తిరుమలకు రానుపోను, టిఫిన్, భోజనం, వసతి వంటి సౌకర్యాల కల్పన కోసం ఒక్కొక్కరి నుంచి రూ.3,600 తీసుకుంది. బస్సులో 36 మంది భక్తులు శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. వీరికి ఉదయం టిఫిన్ పెట్టించి జీపుల ద్వారా తిరుమలకు తీసుకువచ్చారు. వీరిని కృష్ణతేజ సర్కిల్ వద్ద ఉచిత క్యూలైన్ దగ్గర వదిలిపెట్టారు. ట్రావెల్స్ ఇచ్చిన టికెట్‌లను అక్కడ విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందికి భక్తులు చూపించగా ఇవి దర్శన టికెట్లు కాదని తేల్చిచెప్పారు. మీరు ఉచిత దర్శనం క్యూలైన్‌లోకి ప్రవేశిస్తే దాదాపు 10 గంటల తర్వాత దర్శనం అవుతుందని వివరించారు. దీంతో భక్తబృందం ఆగ్రహం వ్యక్తం చేసింది. గంటలోనే దర్శనం చేయిస్తామని ఇలా మోసం చేశారని కొందరు విజిలెన్స్ వారికి ఫిర్యాదు చేశారు. కేసును తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే ట్రావెల్స్ టికెట్‌పై 'ఫ్రీ దర్శనం' అని మాత్రమే రాసి ఉండటం గమనార్హం. ట్రావెల్స్ ప్రతినిధి భాస్కర్ మాట్లాడుతూ.. తాము ఉచిత దర్శనమనే చెప్పామని, ఎలాంటి ప్రత్యేక దర్శన టికెట్లు ఇస్తామని చెప్పలేదని పేర్కొన్నారు.

మామిడి రైతులను ఆదుకుంటాం

● గిట్టుబాటు ధరపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 16(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన మామిడి పరిశ్రమ యాజమాన్యం, రైతు సంఘ నాయకులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలవారీగా వచ్చే మామిడి దిగుబడిని పరిశీలించి మద్దతు ధరకు చర్యలు తీసుకోవాలని ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులను కోరారు. కాయలు పూర్తిగా పక్వానికి వచ్చిన తర్వాత కోయడం వల్ల మార్కెట్‌లో లాభాలు పొందవచ్చునని రైతులకు సూచించారు. అటు రైతులు, ఇటు ఫ్యాక్టరీ యజమానులు నష్టపోకుండా స్థిరత్వం కలిగిన ధరలు నిర్ణయించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకోవడం వల్ల తాము నష్టపోతున్నామని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మరోసారి ఉమ్మడి చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి రైతులు, రైతు సంఘ నాయకులు, ఫ్యాక్టరీ యజమానులతో సమావేశమై చర్చిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), మే 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం అండర్ 19, 23 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు కరకంబాడి రోడ్డులోని కజారియా టైల్స్ ఎదురుగా వున్న సీవీ క్రికెట్ అకాడమీలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితో రావాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 9000214966, 8886185559లను సంప్రదించాలని కోరారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 7 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.72 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,208

తలనీలాలు సమర్పించినవారు: 32,951

● జిల్లాలో 1.25లక్షల మంది రక్తపోటు బాధితులు

● అనధికారికంగా మరో రెండు లక్షలు పైనే





(నేడు ప్రపంచ బీపీ డే)

బీపీ రేస్తోంది..!

ఆరోగ్యంలో అతి ముఖ్యమైన సమస్యగా బీపీ మారిపోయింది. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే బీపీ సమస్య మొదలయ్యేది. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేదు. ముఖ్యంగా యువత అధిక రక్తపోటుకు గురవడమే ఆందోళనపెడుతోంది. జీవనశైలిలో వచ్చిన మార్పులే ఇందుకు ప్రధాన కారణమని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.ప తిరుపతి జిల్లాలో 1,24,607 మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని వైద్య వర్గాల గణాంకాల్లో నమోదైంది. నిజానికి బీపీ చెక్ చేసుకోనివారే అత్యధికంగా ఉంటారు. ఇలా చేస్తే ఈ సంఖ్య భయపెట్టేంత ఉండచ్చని అంచనా. అయితే నియంత్రణలో ఉంచుకుంటే బీపీకి జంకాల్సిన అవసరమే ఉండదు. రక్తపోటు నుంచి ఎలా తప్పించుకోవాలో, ఒకవేళ వస్తే ఎలా అధిగమించాలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ అభిషేక్ కాషా 'ఆంధ్రజ్యోతి'కి ఇలా వివరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

140/90 మించితే..

డాక్టర్ అభిషేక్ కాషా, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, హార్ట్ స్పెషలిస్ట్, తిరుపతి.

సాధారణ రక్తపోటు 120/80 ఉంటుంది. ఇది నిరంతరం 140/90 మించి ఉంటేనే బీపీ ఉన్నట్టుగా భావించాలి. ఎప్పుడో ఒకసారి ఇలా కనిపిస్తే ఆందోళన అవసరం లేదు. ఒత్తిడి, శారీరక శ్రమ వంటి తాత్కాలిక కారణాల వలన హఠాత్తుగా అధిక రీడింగ్ రావచ్చు. అప్రతిరోజు సాధారణం కంటే ఎక్కువ చూపిస్తేనే అధిక రక్తపోటుగా నిర్ధారించుకోవాలి. గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి వాటికి అధిక రక్తపోటు దారితీసే ఆవకాశం ఉంటుంది.

ఇంట్లోనే చెక్ చేసుకోవచ్చు

బీపీ ఎంత ఉందో తెలుసుకుంటూ ఉండడం ముఖ్యం. ఇందుకోసం ఆసుపత్రులకు వెళ్లిల్సిన అవసరం కూడా లేదు. చిన్న పరికరం ఇంట్లో ఉంచుకుంటే చాలు. ఇంట్లో పెద్దవాళ్లు ఉంటే తప్పనిసరిగా బీపీ చెక్ చేసుకుంటూ ఉండాలి.

యువత సతమతం

ఇటీవల యువతలో కూడా అధిక రక్తపోటు ఎక్కువగా కనిపిస్తుంది. ఇది జీవనశైలిలో వచ్చే మార్పులు, ఒత్తిడి, నిద్రలేమి వల్ల జరుగుతోంది. ఈ వయస్సులో రెండవ కారణాల్ని తప్పక పరిశీలించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చాలామందికి బీపీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో లేదా ముందస్తు హెచ్చరిక సంకేతాలను ఎలా గుర్తించాలో పూర్తిగా తెలియదు. ఈ అవగాహన లేకపోవడం వల్ల బీపీని నియంత్రణలో పెట్టలేకపోతున్నారు. బీపీ నియంత్రణకు మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయి. జీవనశైలి మార్పులు తోడైతే ఫలితాలు మరింత మెరుగవుతాయి.

వేసవిలో ఇలా చేయండి..



డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్

బరువు నియంత్రణలో ఉంచుకోవాలి. తక్కువ ఉప్పు, తక్కువ కొవ్వు ఉన్న పదార్థాలే తీసుకోవాలి. మద్యం ఎక్కువైతే ప్రమాదమే. వ్యాయామం, ధ్యానం చాలా మంచి ఫలితాలను ఇస్తుంది. రక్తపోటును నివారించగల లేదా నియంత్రించగల ఆహారపు అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యం. వేసవిలో లభించే పండ్లూ కూరగాయల్లో ఏవి బీపీ నియంత్రణకు సహకరిస్తాయో స్విమ్స్ డైటీషియన్ డాక్టర్ కందారపు గీత ఇలా వివరిస్తున్నారు...



పుచ్చకాయ: ఇది చాలా హైడ్రేటింగ్‌గా ఉంటుంది. ఇందులో ఎల్-సిట్రులైన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలోనూ, రక్తపోటును తగ్గించడంలోనూ సహాయపడుతుంది. ధమనుల పనితీరుకు మెరుగుపరుస్తుంది. దీనిలోని పొటాషియం కంటెంట్ శరీరంలో సోడియం ప్రభావాలను సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది.



దోసకాయ: వేసవిలో రక్తపోటును నియంత్రించడంలో అద్భుతమైనది. కేలరీలు తక్కువగా ఉంటాయి. పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది రక్త నాళాలను సడలించడానికి, మూత్రం ద్వారా అదనపు సోడియంను విసర్జించడానికి సహాయపడుతుంది,



ఆకుకూరలు: వేసవిలో దొరికే చాలా రకాలైన ఆకుకూరల్లో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి, రక్త నాళాలను వెడల్పు చేసి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.



కొబ్బరి నీళ్లు: వీటిలో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి ద్రవ సమతుల్యతను నియంత్రించడంలో రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి.



మామిడి పండ్లు: ఫైబర్, పొటాషియం, బీటా-కెరోటిన్ కూడా పుష్కలంగా ఉంటాయి, ఇవి అధిక రక్తపోటును నిర్వహించడంలో సహాయపడతాయి.



నిమ్మకాయ: విటమిన్ సి ఫ్లేవనాయిడ్లు బీపీ నియంత్రణకి ఎంతో ఉపయోగం.

వ్యాపారిని బురిడీ కొట్టించి...

● ఫోన్‌పే ద్వారా రూ.81వేల లూటీ ● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): చిల్లర దుకాణం వ్యాపారిని బురిడీ కొట్టించిన ఇద్దరు టక్కరి దొంగలు రూ.81వేలను స్వాహా చేశారు. బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఈ సరికొత్త సైబర్ క్రైం శ్రీకాళహస్తిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణం గాంధీవీధికి చెందిన మునస్వామి తిప్ప ప్రాంతం ఆర్టీసీ రోడ్డులో ప్రొవిజన్‌షాప్‌ను నిర్వహిస్తుంటాడు. బుధవారం రాత్రి ఇద్దరు యువకులు సరుకులు కొనుగోలు కోసం మునస్వామి దుకాణానికి వచ్చారు. రూ.5వేలకు సరుకులు కొనుగోలు చేసిన తరువాత తమ వద్ద రూ.వెయ్యి నగదు మాత్రమే ఉందన్నారు. మిగతా రూ.4వేలను ఫోన్‌పే చేసేందుకు తమ సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ అయిందని నమ్మించారు. దుకాణదారుడి సెల్‌ఫోన్ నుంచి తమ నాన్నకు ఫోన్ చేసి మిగిలిన రూ.4వేలను ఫోన్‌పై ద్వారా జమ చేస్తామని నమ్మించారు. దీంతో మునస్వామి వారికి ఫోన్ ఇచ్చాడు. ఒక యువకుడు దుకాణదారుడిని మాటల్లో పెట్టాడు. మరో యువకుడు మునస్వామి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పేను ఆపరేట్ చేసి తిరిగి అప్పగించాడు. ఆ తరువాత కొనుగోలు కోసం వచ్చిన యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటి తరువాత బ్యాంకు ఖాతా నుంచి రూ.81వేలు నగదు మాయమైనట్లుగా మునస్వామికి మెసెజ్ వచ్చింది. దాంతో ఒకసారిగా ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యాడు. సరుకుల కొనుగోలు కోసం వచ్చిన ఇద్దరు యువకులకు ఫోన్ ఇవ్వడం కారణంగా నగదు లూటీ అయినట్లు గుర్తించి బాధితుడు గురువారం శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదని బాధితుడు తెలిపాడు.

హత్యకేసుపై ఎస్పీ సీరియస్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని జరిగిన హత్య ఉదంతంపై తిరుపతి ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్‌గా స్పందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాల్లో గడచిన రెండు వారాల్లో మూడు అనుమానాస్పద మరణాలు, హత్య వెలుగుచూసిన విషయం తెలిసిందే. వరుసగా ఒంటరి వ్యక్తులు హతమవుతుండటంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 16న శుక్రవారం 'ఏం జరుగుతోంది' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ స్పందించారు. మొదట మూడు అనుమానాస్పద మరణాలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఎందుకు ఆదిలోనే ప్రత్యేక దృష్టి సారించలేదని శ్రీకాళహస్తి పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఇక నాల్గో ఘటన ముక్కంటి ఆలయ సమీపంలోని శ్మశాన వాటికలో గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హతమార్చిన అంశంపై స్థానిక పోలీసులను లోతాగా ఆరా తీశారు. హత్య జరిగి మూడు రోజులు అయినప్పటికీ కనీసం హతమైన యువకుడు ఎవరు అన్న వివరాలను ఎందుకు గుర్తించలేకపోయారని నిలదీసినట్లు సమాచారం. మృతదేహానికి రక్తపు మరకలను కూడా మూడు రోజుల నుంచి ఎందుకు శుభ్రం చేయలేదని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్థానిక పోలీసు అధికారులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి చేరుకుని మృతదేహం ముఖంపై ఉన్న రక్తాన్ని శుభ్రం చేయించారు. హత్య జరిగిన శ్మశానానికి చేరుకుని ఆనవాళ్ల సేకరణ చేపట్టారు. వేగవంతంగా హత్య కేసును ఛేదించాలని ఎస్పీ స్థానిక పోలీసులను ఆదేశించారు. దీంతో రెండు బృందాలుగా పోలీసులు ఏర్పడి గాలింపు ముమ్మరం చేశారు.

ప్రభుత్వ భూమికి అడ్డదారిలో డీకేటీ పట్టా!

● అడంగల్‌లో నమోదు

● ఫ్రీ హోల్డ్ భూముల పునఃపరిశీలనతో వెలుగు చూసిన వైనం

పుత్తూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పరిధిలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. నందిమంగళం లెక్కదాఖలాల్లోని సర్వే నెం.6/2లో 3.76 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 2003కు ముందు ప్రభుత్వ భూములకు పట్టా పొందిన లబ్ధిదారులకు సర్వ హక్కులు కల్పిస్తూ ఫ్రీహోల్డ్ పద్ధతిని అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఫ్రీహోల్డ్ ప్రక్రియలో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖకు ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ జాబితాను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు వాస్తవాలు వెలుగు చూశాయి.

ఏం జరిగిందంటే..

చిత్తూరు సంతపేటకు వెంకటపెరుమాళ్ భార్య సుబ్బలక్ష్మమ్మకు 1991లో డీకేటీ పట్టా (నెం.52/4/91) జారీ చేసినట్లు నకిలీ పత్రం రూపొందించినట్లు ఆరోపణలున్నాయి. చిత్తూరుకు చెందిన మహిళకు పుత్తూరులో భూమి కేటాయించడంపై విమర్శలున్నాయి. అయితే, భర్త మరణానంతరం సుబ్బలక్ష్మమ్మ పుత్తూరులోని రెండో కుమార్తె నాగరత్నమ్మ వద్దకు వచ్చినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పటికే 65 ఏళ్ల వయసున్న ఆమె.. కుమారులు బాలసుబ్రమణ్యం, హరినాథశెట్టి, శ్రీనివాసులు శెట్టి, కుమార్తెలు విజయ, నాగరత్నమ్మ, లలితకు వివాహాలు చేశారు. ఈ వివరాలను తన కుమార్తె నాగరత్నమ్మ పేరిట 1991 మే 7న రాసిన వీలునామాలో పొందుపరిచారు. అసలు 65 ఏళ్ల వయస్సులో సుబ్బలక్ష్మమ్మకు డీకేటీ భూమి ఎందుకు ఇచ్చారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కాగా, 2016 జనవరి 14న సుబ్బలక్ష్మమ్మ మృతి చెందారు. ఆ తర్వాత నాగరత్నమ్మ 2018 జూన్ 26న తన భర్త కుప్పుస్వామి పేరిట రిజిస్టర్ వీలునామా రాశారు. ఆయన కుమారుల పేరిట రిజిస్టర్ చేశారు. పాసుపుస్తకం, ఆన్‌లైన్ అడంగళ్‌లో పేర్లు నమోదు వంటివి శరవేగంగా జరిగిపోయాయి. వీరి కుటుంబం వైసీపీలో కొనసాగుతుండటంతో తమ పరపతిని వినియోగించి ఎవరికీ అనుమానాలు తలెత్తకుండా ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చినట్లు విమర్శలున్నాయి. 3.76 ఎకరాలకు ఏడు అడుగుల ఎత్తుతో ప్రహరీ నిర్మించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్రీ హోల్డ్ భూములను పునఃపరిశీలించే ఈ క్రమంలో ఈ విషయం వెలుగు చూసింది. రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. 40 ఏళ్లుగా తమ ఆధీనంలో భూమి ఉందంటూ, మామిడి, ఇతర పంటలు వేసినట్లు కుటుంబ సభ్యుడు నరసింహారావు చెబుతుండటం గమనార్హం.

> **అభ్యంతరకరంగా డీకేటీ జారీ**
>
> డీకేటా పట్టా జారీ అభ్యంతరకరంగా ఉంది. నిబంధనలకు అనుగుణంగా పట్టాదారు వివరాలు రిజిస్టర్‌లో నమోదు కాలేదు. ఇవేవి లేకున్నా ఫ్రీహోల్డ్ జాబితాలో నమోదైంది. ఈ వివరాలను ఆర్డీవో, జేసీకి నివేదించా.
>
> - వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు



నిర్మాణంలో ఉన్న ప్రహరీ

యువకుడిని ఢీకొన్న టిప్పర్

● పరిస్థితి విషమం ● గ్రామస్తుల ఆగ్రహం ● టిప్పర్ల అడ్డగింత

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడిని గ్రావెల్ టిప్పర్ ఢీకొంది. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో గ్రామస్తులు ఆగ్రహించారు. టిప్పర్లను అడ్డుకున్నారు. దీంతో సాగరమాల రోడ్డు పనులకు గ్రావెల్ సరఫరా చేసే వందలాది టిప్పర్లు ఆగిపోయాయి. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం ఊనుగుంటపాళెం గ్రామానికి చెందిన యువకుడు అరుణ్‌తేజ గురువారం రాత్రి మైక్రో టవర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ఒక టిప్పర్ వేగంగా వచ్చి అతడిని ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ యువకుడిని చూసి గ్రామస్తులంతా ఊనుగుంటపాళెం వద్ద సాగర మాల రోడ్డు పనులకు గ్రావెల్ తరలిస్తున్న సుమారు వందకు పైగా టిప్పర్లను అడ్డుకున్నారు. యువకుడిని ఢీకొట్టిన టిప్పర్ డ్రైవర్ ముందుకు రావాలని కోరారు. ఎవ్వరూ రాకపోవడంతో రోడ్డుపైనే సాయంత్రం వరకు టిప్పర్లను కదలనివ్వలేదు.



ఊనుగుంటపాళెం వద్ద టిప్పర్‌లను అడ్డుకుని ఉన్న గ్రామస్తులు

ఏఎంపురంలో మళ్లీ గ్రావెల్ తవ్వకాలు

సత్యవేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ఇక్కడి ప్రైవేట్ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రావెల్ తవ్వకాలకు ఐదేళ్ల కాలపరిమితికి అనుమతులు పొందిన కొందరు చెన్నైకు చెందిన మట్టి మాఫియా మళ్లీ జూలు విదిలిస్తోంది. అప్పటి అనుమతులను అడ్డం పెట్టుకుని గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్నారు. నాలుగేళ్లుగా అడ్డు అదుపులేకుండా సాగించిన గ్రావెల్ రవాణా ధాటికి సత్యవేడు- టీపీకోట రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇప్పటికీ కష్టాలు అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పది నెలలుగా స్తబ్ధుగా ఉన్న మట్టి మాఫియా మళ్లీ పేట్రేగుతోంది. నాలుగు రోజులుగా పదుల సంఖ్యలో టిప్పర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా చెన్నైకు గ్రావెల్ తరలిస్తున్నారు. టిప్పర్లను రోడ్డుకిరువైపులా భారీగా నిలిపి వేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి. మరో వైపు ఏఎంపురంలో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలోనే రిజర్వ్ ఫారెస్ట్ కూడా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో నెమళ్ళు, జింకలు తదితర వన్యప్రాణులు విరివిగా ఉన్నాయి. ఈ గ్రావెల్ తవ్వకాల వర్యావరణ, జీవవైవిధ్యానికి విఘాతం కలుగుతోందని ప్రజలు ఆవేదన వ్యకం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రావెల్ తవ్వకాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.



ఏఎంపురంలో జరుగుతున్న గ్రావెల్ రవాణా

శ్రీవారి సేవలో జాస్తి చలమేశ్వర్

తిరుమల, మే16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి, 16వ ఆర్థిక సంఘం సభ్యుడు సౌమ్య కాంతి ఘోష్, తెలంగాణ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ప్రముఖ సినీనటుడు కృష్ణ సోదరుడు, సినీ నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరి రావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ముందు జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్‌లు

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం కేశవరం సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్ అనీల్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ శివకుమార్‌లకు శుక్రవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పేదల పెన్షన్‌కు సంబంధించి రూ.2.40లక్షలు, మరో రూ 50వేలను డీఆర్‌డీఏ కార్యాలయానికి చెల్లించకుండా స్వాహా చేశారని ఎంపీడీఓ తెలిపారు. దీనిపై రెండు రోజుల్లోగా నగదు చెల్లించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా వ్యవసాయ అసిస్టెంట్ శివకుమార్ విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వడదెబ్బకు మహిళా రైతు మృతి



వసంత నిర్మల (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, మే 16(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీ పరిధిలోని రామలింగాపురం రాజులకండ్రిగకు చెందిన వసంత నిర్మల(39) వడదెబ్బకు గురై మృతి చెందారు. గురువారం ఎండలో పొలంలో పని చేసుకుంటూ అక్కడ వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గురువారం తొట్టంబేడు రెవెన్యూ అధికారులు సర్వే చేసేందుకు వచ్చారు. వసంత పొలంతో పాటు ఐదుగురు రైతులకు చెందిన పొలాల్లో గతంలో బాట ఉండేదని అందుకు అధికారులు సర్వే చేసేందుకు అక్కడికి చేరుకున్నారు. దీనికి వసంత అభ్యంతరం చెప్పడంతో పాటూ వారితో వాగ్వాదానికి దిగింది. అనంతరం పొలం పనులు చేస్తూ తీవ్రమైన ఎండకు అస్వస్థతకు గురై పొలంలోనే మృతి చెందింది.

కొత్త రేషన్ కార్డులకు సర్వర్ సమస్య

పెళ్లకూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకేవారిని సర్వర్ సమస్య వేధిస్తోంది. మండలంలోని 13 గ్రామ సచివాలయాలోని దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. కొత్త రేషన్ కార్డులతో పాటు, పేర్లు, చిరునామాలో మార్పులు, చేర్పులకు ఈ నెల 15 నుంచి సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు సచివాలయాలకు వెళ్తున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తుంటే సర్వర్ సమస్యతో చాలా ఆలస్యమవుతోందని డిజిటల్ అసిస్టెంట్‌లు చెబుతున్నారు. దరఖాస్తుదారులు వెనుదిరుగుతున్నారు.

రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగాలి


మాట్లాడుతున్న డీఎస్‌వో శేషాచలం రాజు

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్‌వో శేషాచలంరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం పంపిణీ 17వ తేదీకి పూర్తి చేయాలన్నారు. చౌక దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలు సక్రమంగా పనిచేసే విధంగా ఉండాలని తూకాల్లో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బలిజ సంఘం చేయూత



కుట్టుమిషన్ అందజేస్తున్న బలిజ చేయూత ఫౌండేషన్ నాయకులు

నాయుడుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబానికి చెందిన సారంగం శ్వేతకు నాయుడు పేటలోని ఎంఎస్‌ఆర్ ఇంజనీరింగ్ దుకాణం వద్ద బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ నాయకులు కుట్టుమిషన్‌ను శుక్రవారం అందజేశారు. శ్వేత కుటుంబ జీవనోపాధికి కుట్టుమిషన్ ఆసరాగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ చేయూత ఫౌండేషన్ నాయకులు పగడాల శివప్రదీప్, హంస పృథ్వీచంద్, గడదాసు వెంకటేశ్వర్లు, హంస రామారావు, నీలం హరీ, పసుపులేటి రాజాబాబులు ఉన్నారు.

కల్యాణం..కమనీయం


గజ, సింహవాహనాలపై వేంచేస్తున్న అమ్మవార్లు, స్వామివారు

నాయుడుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి టీటీడీ వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కల్యాణానికి శ్రీదేవి.. భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గజవాహనంపై స్వామివారు, సింహ వాహనంపై విహరిస్తూ నగరోత్సంలో భక్తులను అనుగ్రహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణ ఘడియల్లో పలువురు కల్యాణం చేసుకుని ఒక్కటయ్యారు.

కరెంట్ కోతలు లేకుండా చూడండి

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో ఇటీవల కాలంలో అప్రకటిత విద్యుత్ కోతలు చేస్తున్నారని వేసవి దృష్టిలో పెట్టుకుని విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్కే రియాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండుటెండలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతుంటే వేళాపాళ లేని విద్యుత్ కోతలు విధించడం తగదని పేర్కొన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరారు. అప్రకటి కోతలు విధిస్తే సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం వైజేపీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి ఆర్‌వీ.రావు, గోపీనాథ్‌రెడ్డి, మురళీనాయుడు, మురళీరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై దాడి.. కేసు నమోదు

బాలాయపల్లి, మే16(ఆంధ్రజ్యోతి) మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన వుప్పతోట్టి నరసయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి మచ్చుల కిరణ్ అనే యువకుడు భూ వివాదంపై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ వంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని వైద్యసిబ్బంది అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్థానిక పూలతోట గిరిజనకాలనీ, తూర్పువీధి ప్రాంతాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల అపరిశుభ్రత వలన దోమలు పెరుగుతాయన్నారు. దోమల వలన డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. అందువల్ల పరిసరాలలో మురుగునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రేష్మ, యాస్మిన్, శకుంతల, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నవశిశువులకు క్యాప్‌టవళ్ల పంపిణీ



గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీధర్‌రెడ్డి దాతృత్వంతో నవశిశువులకు క్యాప్‌టవల్స్‌ను పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, శ్రీధర్ రెడ్డి, పీవీ.కృష్ణయ్య, రామ్‌ప్రసాద్, సురేష్, వెంకటేశ్వర్లు, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భారీ ర్యాలీతో స్వాగతం

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు ఘన స్వాగతం లభించింది. వాకాడు, గొల్లపాళెం పర్యటనకు వెళుతూ విద్యానగర్ చేరుకున్న ఎమ్మెల్యేకు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోట, మే 16 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం చెందోడు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని కోట, ఉత్తమనెల్లూరు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, సిద్ధవరం, వంజివాక విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధితో పాటు చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేస్తామని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమ్మవారిని ఆలయంలో ఉంచాలి



వెంకటగిరిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట బీసీ కాలనీలో ఉన్న కాశీ పురాదేశ్వరి అన్నపూర్ణమ్మ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని స్వామి వివేకానంద యువసైన్యం వ్యవస్థాపకులు ప్రకృతికుమార్ కోరారు. ఆలయం కొలువైన స్థలం తమకు చెందినదని కొందరు ఆలయంలోని విగ్రహాన్ని వారంత రోజుల క్రితం వెలుపల ఉంచారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శివప్రసాద్‌కు శుభాకాంక్షలు


బహుమతి ప్రదానం చేస్తున్న అప్పిన వెంకటేశ్వర్లు

వెంకటగిరి టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా శివ ప్రసాద్‌ను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని ప్రముఖ అధ్యాపకులు అప్పిన వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్ తదితరులు

ఉగ్రవాదానికి చోటు లేదు

నాయుడుపేట/ వాకాడు/ మే 16 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదానికి చోటులేదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఆపరేషన్ సింధూ విజయవంతం అయిన నేపథ్యంలో నాయుడుపేటలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదులకు ఈదేశంలో చోటు లేదన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మనసైన్యం చలువతోనే మనమంతా ప్రశాంతంగా ఉన్నామని వారిసేవలు ఎనలేనివని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రంగినేని కృష్ణయ్య, రఫీ, గంగాప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, దార్ల రాజేంద్ర, పొట్లపూడి రాజేష్, అవధానం సుధీర్, భాస్కర్, జీవీఆర్ నాయుడు, మస్తాన్, చిగురువాడ అశోక్‌కుమార్, ధనంజయ, సుబ్బారావు, నారాయణ, రవి, ఇమిడిశెట్టి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. ● ఆపరేషన్ సింధూ విజయవంతం అయిన నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వాకాడు అశోక్ పిల్లర్ నుంచి తిరంగా ర్యాలీ నిర్వహించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు


అజిత్‌కుమార్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

వాకాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 300 మందికి పైగా వైసీపీని వీడి టీడీపీలో శుక్రవారం చేరారు. తీరప్రాంతాలలో 3 పంచాయతీలకు పైగా పట్టు ఉన్న రావిగుంటపాళెం గ్రామానికి చెందిన దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి తన అనుచరులైన నిడిగుర్తి సర్పంచ్ నాగరాజు, రావిగుంటపాళెం ఇన్‌చార్జి సర్పంచ్ వాకాటి బాలకృష్ణారెడ్డి, పూడిరాయదొరువు ఎంపీటీసీ బండి శోభన, ఈదూరు వెంకటాద్రి, కోట రమేష్, చెంగారెడ్డి రవి, తీపలపూడి చెంగయ్యలతోపాటు మరో 150 మంది వైసీపీని వీడి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. అదే విధంగా కొండాపురం పంచాయతీ నుంరుట తుమ్మల మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో అట్ల కస్తూరయ్య, వంకా రమణయ్య, మేకల దశయ్య, పైగాల లింగమ్మ, పల్లాపల్లి సురేష్, మేరిగ సుబ్రహ్మణ్యంలతోపాటు మరో 40 మంది టీడీపీలో చేరారు. వెంకటరెడ్డిపాళెం నెలిపూడి పంచాయతీ నుంచి పల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అట్ల హరీలతోపాటు 50 మంది పార్టీలో చేరారు. వాకాడు పంచాయతీలో భార్గవ్‌రామ్‌శెట్టి, రామలింగారెడ్డి, శివయ్యశెట్టిలు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, చిరంజీవమ్మ, తడివి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామికి వసంతోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి, వసంతోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్ణాలవీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ వసంతోత్సవం నిర్వహించి, మాఢవీధి ఉత్సవం జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి చక్రస్నానం వైభవంగా జరిపారు. ఈ పూజాకార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రికార్డుల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ, పక్కనే ఎంపీడీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో జాలిరెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సాధారణ తనిఖీల్లో భాగంగా సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో విద్యారమ శుక్రవారం పలు రికార్డులను తనిఖీ చేశారు. అలాగే మన్నారు పోలూరులోని టూరిజం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్న డీఎల్‌డీవో కార్యాలయ గదులను పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతానికి మన్నారుపోలూరు టూరింజ కాంప్లెక్స్‌లో డీఎల్‌డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శాశ్వత భవనం నిర్మాణం పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్య క్రమంలో ఆమెతో పాటు ఎంపీడీవో మురళీకృష్ణ, డీఎల్‌డీవో జాలిరెడ్డి, పీఆర్ డీఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, సీనియర్ అసిస్టెంట్ రఘునాథరెడ్డి ఉన్నారు.

ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించండి

వాకాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డేలో లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు సమస్య లపై 115 అర్జీలు వచ్చాయి. ఆయా శాఖల అధికారులు అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్య క్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు, టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖరరెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి, దయాకర్ ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బాలాయపల్లి, మే16(ఆంధ్రజ్యోతి) మండలంలోని జయంపు గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం తెల్లవారు జామున బాలాయపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి మండలానికి చెందిన శివనాయుడు సహకారంతో అరవ సురేష్ అనే వ్యక్తి బాలాయపల్లి మండలంలోని జయంపు కూడలి వద్ద రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా రాత్రి గస్తీలు నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో 21 బస్తాల (1021 కేజీలు) బియ్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో ప్రజలు అర్జీ రూపంలో ఇచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆమె ప్రజల నుంచి సమస్యల పై అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వివిధ సమస్యల పై మొత్తం 103 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు సతీష్, గాడి నారాయణ రెడ్డి, శ్రీనివాసుల నాయుడు, మేడా సాయి నారాయణ తదితరులు ఉన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



తడ, మే 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ వైద్యులు కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి నివారణకు తీసుకో వాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

గాయపడిన విద్యార్థి మృతి

సూళ్లూరుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగుల కాలనీ పులికాట్ నగర్ (కేఆర్‌పాలెం)లోని అంతరిక్ష కేంద్రీయ పాఠశాల మూడో అంతస్తు భవనం పై నుంచి పడి గాయపడిన పదో తరగతి విద్యార్థి ఇస్రాత్ అలీ (15) చెన్నైలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాఠశాలలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహి స్తున్నారు. ఈ క్రమంలో గురువారం విరామ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి ఇస్రాత్ అలీ ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డారు. చెన్నైకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్‌ఐ రామ్మూర్తి విద్యార్థి పోస్టుమార్టం నిమిత్తం చెన్నైకి వెళ్లారు. కేసు నమోదు చేశారు.

నేడు తిరంగా యాత్ర

డక్కిలి, మే 16 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరంగ యాత్ర చేపట్టనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలియజేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాత్ర కాశీపేట సుభాష్ చంద్రబోస్ బొమ్మదగ్గర నుంచి మొదలవుతుందన్నారు. ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

ఒకరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-తుమ్మూరు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. పట్టణంలోని మునిరత్నం నగర్ కాలనీకి చెందిన హుస్సేన్ ద్విచక్ర వాహనంలో నాయుడుపేటకు వస్తుండగా ఆటో ఢీకొంది. హుస్సేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు.

హెల్మెట్ ధరించాలి

గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెండోపట్టణ పరిధిలోని పాతసంతరోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో సరైన ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలన్నారు.

ప్రమాదాలకు నిలయాలుగా మలుపులు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటున్న జనం

గూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో మలుపులు, కూడళ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. పట్టణ జనాభా పెరగడం, గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల మీద వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా మారుతోంది. దీంతో వాహనాల సంఖ్య పెరిగింది. ప్రధానంగా గూడూరు ఆర్టీసీ బస్టాండు నుంచి ఆస్పత్రి రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్‌కు, రైల్వేస్టేషన్ రోడ్డు మార్గంలో వివేకానంద రోడ్డు మీదుగా శాంతినగర్ అండర్‌బ్రిడ్జి నుంచి రెండో పట్టణానికి, రాపూరు, వెంకటగిరి వైపు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ మార్గంలోనే ఎక్కువగా వాహనాల రద్దీ ఉంటుంది. ఆర్టీసీ బస్టాండు నుంచి పట్టణానికి వచ్చే మార్గంలో సంగం థియేటర్ సెంటర్ వద్ద మూడు రోడ్ల కూడలితో పాటు మలుపు తిరగాల్సి ఉంటుంది. ఆస్పత్రి రోడ్డులో చందమామ ఐస్‌క్రీమ్ సెంటర్ వద్ద మూడురోడ్ల కూడలి, మోతీమహల్ సెంటర్ వద్ద నాలుగు రోడ్ల కూడలి, ఏరియా ఆస్పత్రి వద్ద, పాతబస్టాండు వద్ద, రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి మలుపు వద్ద, రెండోపట్టణ పరిధిలోని ఎస్ఆర్‌పీ సెంటర్ వద్ద, జీఎస్‌రాయులు సెంటర్ వద్ద గల మలుపులలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా వాహనాల సంఖ్య పెరగడంతో ఈ ప్రధాన రహదారిపై వాహనాలను వేగంగా నడుపుతుండడం వలన ఇటు కూడళ్ల వద్ద, అటు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అంతేకాకుండా ఈ ప్రాంతాలలో రోడ్డు దాటే సమయాలలో పాదచారులను సైతం వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని పలువురు గాయాలపాలయ్యారు. ఈ ప్రధాన రహదారిలోని మలుపులు, కూడళ్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు వేగనిరోధకాలను ఏర్పాటు చేస్తే కొంతవరకు ప్రమాదాలను నివారించవచ్చునని స్థానికులు అంటున్నారు.




సంగం థియేటర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు, మూడు రోడ్ల కూడలి, రైల్వేస్టేషన్ వద్ద మలుపు, రెండోపట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌పీ సెంటర్ వద్ద మలుపు